నేడు పాఠశాలలకు సెలవు

ఏలూరు సిటీ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో అతలాకుతలమవుతున్న జిల్లాలో ముందస్తుజాగ్రత్త చర్యల్లో భాగంగా శనివారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. తొలుత శుక్రవారం మధ్యాహ్నం నుంచే విద్యార్థులను ఇళ్లకు పంపించివేసి పాఠశాలలను మూసి వేయగా, వాతావరణ శాఖ నుంచి అందిన సమాచారం మేరకు శనివారం పూర్తిగా సెలవును ప్రకటిస్తున్నట్టు డీఈవో అబ్రహం వెల్లడించారు.


వేలేరుపాడు మండలం కమ్మరిగూడెం సమీపంలో పెద్దవాగు వరద ఉధృతికి ధ్వంసమైన రహదారి


వేలేరుపాడు మండలంలో పెద్దవాగు వరదకు కొట్టుకుపోయిన వేలేరుపాడు-అశ్వారావుపేట రోడ్డు


పెద్దవాగు ప్రాజెక్టుకు ఎడమవైపున పడిన గండి

వరద విలయం

వేలేరుపాడును ముంచేసిన పెద్ద వాగు


కమ్మరిగూడెంలో నేలమట్టమైన ఇళ్లు

ఏలూరు/వేలేరుపాడు/కుక్కునూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడిపల్లి సమీపంలోని పెద్ద వాగుకు సంభవించిన భారీ వరదతో వేలేరుపాడు అతలాకుతలమైంది. గురువారం ఎగువ భాగం నుంచి భారీగా వరదనీరు ప్రాజెక్టులోకి చేరడం ఒక ఎత్తైతే, ఈ ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేసేందుకు మూడు గేట్లలో ఒకటి పైకి లేవకుండా మొరాయించడం.. ఈ కారణంగానే వరద నీరు కిందికి చేరడంలో ఆటంకం ఏర్పడి గండికి దారితీసింది. గురువారం మధ్యాహ్నం నుంచి వరద నీరు ప్రాజెక్టు కట్టల మీదుగా దిగువకు పారడం ఆరంభమైంది. ప్రాజెక్టుకు ఎడమ భాగాన, క్రస్ట్ గేటుకు పక్కన వరద ఉధృతికి గట్టు తట్టుకోలేక క్రమేపీ గండికి దారితీసింది. దీంతో వరద నీరంతా దిగువకు దూసుకుపోవడంతో 15 గ్రామాలకు పైనే నష్టాన్ని చవిచూశాయి. ఒంటిబండ, ఊటగుంపు, మేడేపల్లి గ్రామాల్లోని ఇళ్లలోకి వరదనీరు దూసుకొచ్చింది. దీంతో పూరి గుడిసెలు నేలమట్టమయ్యాయి. ప్రజలు ప్రాణాలు అరచేత పట్టుకుని గుట్టపైకి పారిపోయి, తలదాచుకున్నారు. రాత్రంతా చిమ్మ చీకటిలోనే గడిపారు. అల్లూరినగర్, రెడ్డిగూడెం క్రాస్ రోడ్డు వరకు దాదాపు ఐదు కిలోమీటర్ల మేర రహదారి ధ్వంసమైంది. రెడ్డిగూడెం - వసంతవాడ మధ్య మరో కిలోమీటరు మేర మార్గంలో ఇదే పరిస్థితి. ఇక్కడ ఐదిళ్ళు ధ్వంసమయ్యాయి. పెద్దవాగు కారణంగా సుమారు 15 గ్రామాల్లో 70 శాతంపైగా ఇళ్ళు పాక్షికంగాకానీ, పూర్తిగా కాని దెబ్బతిన్నాయి. వేలేరుపాడు మండలమే తరచూ ముంపు లేదా వరద బారిన పడుతూనే ఉంది. ఈ మండలంలో సాధారణ పరిస్థితులు తిరిగి నెలకొనేందుకు చాలాకాలం పట్టే అవకాశం ఎక్కువగా ఉంది.

కమ్మరిగూడెం విలవిల

పెద్ద వాగు ప్రాజెక్టుకు కూత వేటు దూరంలోని కమ్మరి గూడెం గ్రామంపైకి మృత్యువులా వరద వచ్చి పడటంతో గ్రామానికి చెందిన ప్రజలు సమీపంలోని గుట్టలపైకి చేరుకుని ప్రాణాలు దక్కించుకున్నారు. వరద ఒక్కసారిగా వచ్చిపడటంతో కట్టుబట్టలతోనే పరుగులు తీయడంతో ఇళ్లలోని సామగ్రి వరదలో కొట్టుకుపోవడంతోపాటు గ్రామంలోని పశువులు, కోళ్ళు, పెంపుడు జంతువులు మొత్తం వరదలో కొట్టుకు పోయాయి. తీవ్రమైన వరద ధాటికి గ్రామంలోని పక్కా ఇళ్ళు తప్ప పూరిళ్ళు కుప్పకూలిపోయాయి. సర్వస్వం వరద పాలు కావడంతో ఆ గ్రామ ప్రజలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇళ్లలోని తడిచిపోయిన వస్తువులను శుభ్రం చేసుకుని ఆరబెట్టుకునే ప్రయత్నాలు చేస్తున్న వరుణుడు కరుణించక పోవడంతో ఆ సామాన్లు ఆరే అవకాశాలు లేకుండా పోయాయి. టీవీలు, ఫ్రిడ్జ్‌లు ఇతర ఎలక్ట్రానిక్ సామాన్లు వరదకు తడిచిపోవడంతో ఇంతకాలంగా కష్టపడి సంపాదించుకున్న సొమ్ములతో కొనుక్కున్న వస్తువులన్నీ వరద పాలు కావడంతో వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. వీటితో పాటు ఇళ్ళల్లో నిల్వ చేసుకున్న బియ్యం, వడ్లు, ఇతర ధాన్యాలు సర్వం వరదపాలు కావడంతో ఇప్పుడు ఆ గ్రామస్థులు తమను ఆదుకునే ఆపన్న హస్తాల కోసం ఎదురు చూసే దయనీయమైన పరిస్థితులు నెలకొన్నాయి.



పెద్దవాగు వరదకు వేలేరుపాడు మండలంలో దెబ్బతిన్న రోడ్డు .. కోతకు గురైన కుక్కునూరు- దాచారం రోడ్డు

ధ్వంసమైన రోడ్లు

పెద్ద వాగు మహోగ్ర రూపానికి వేలేరుపాడు మండల వ్యాప్తంగా ప్రధాన రహదారులతోపాటు గ్రామాల్లోని అంతర్గత రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయి. మండలవ్యాప్తంగా రహదారులు వంతెనలు, దెబ్బ తినడంతో వేలేరుపాడుకు చుట్టుపక్కల గ్రామాలతో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. వేలేరుపాడు, అశ్వారావుపేట ఆర్‌అండ్‌బీ రహదారిపై ఐదు కిలోమీటర్ల మేర భారీగా గండ్లు పడటంతో వాహనాలు తిరిగే పరిస్థితి లేకపోయింది. ఈ మండలానికి పాలు, గ్యాస్, కూరగాయాలు, ఇతర నిత్యావసర సరుకులు అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం ప్రాంతాల నుంచి వ్యాపారులు కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తుంటారు. రోడ్లు దారుణంగా దెబ్బ తినడంతో వాహనాలు వచ్చే పరిస్థితి లేక పైన పేర్కొన్న వాటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వీటి కొరతతో మండల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గండ్లుపడ్డ రహదారులను ఎంత త్వరగా బాగుచేయాలన్న కనీసం వారం రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులే అంటున్నారు. అప్పటి వరకు ఈ పరిస్థితి ఇలానే కొనసాగే అవకాశాలు ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద వాగు కాల్వ ఉధృతికి కుక్కునూరు -లచ్చిగూడెం ప్రధాన రహదారి కొట్టుకుపోవడంతో భారీ గండి పడింది. రెండుచోట్ల ఈ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. కుక్కునూరు- దాచారం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి గుండేటి వాగు వరద నీటికి కోతకు గురైంది. కుక్కునూరు-దాచారం మధ్య ఉన్న గుండేటి వాగులో లెవల్ కాజ్ వేకు ఇరువైపులా అప్రోచ్ కొట్టుకు పోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు- భద్రాచలం, కుక్కునూరు-అశ్వారావుపేట ప్రధాన రహదారంతా గోతులమయం కావడంతో వర్షపు నీటితో నిండిపోయింది. దీంతో ప్రజలు ఈ రహదారిపై ప్రయాణిం చాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెడ్డిగూడెంలో పాత వాగు ఉధృతికి పలు ఇళ్లు నీట మునిగాయి. దీంతో వారిని సమీప పాఠశాల భవనంలో పునరావాసం కల్పించి రెవెన్యూ అధికారులు భోజన సదుపాయం కల్పించారు. భారీ వర్షాలకు మండలంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో గడిచిన 24 గంటలుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఓ వైపు భద్రాచలంలో వరద నీటి ప్రవాహం పెరుగుతోంది. దీంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తాహసీల్దార్ అచ్యుతకుమారి కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో టోల్‌ఫ్రీ నెంబర్ 83097 03949కి ఫోన్ చేయాలని సూచించారు.

మొరాయించిన మూడో గేటు.. భారీ గండి

- గుట్టలెక్కి ప్రాణాలు కాపాడుకున్న జనం
- సర్వం కోల్పోయిన కమ్మరిగూడెం
- ఇంటిలోని సామగ్రి వరద పాలు
- కట్టు బట్టలతో మిగిలిన ప్రజలు
- వందలాది పశువులు మృత్యువాత
- కూలిన ఇళ్లు.. కొట్టుకుపోయిన రోడ్లు
- 36 గంటలుగా నిలిచిన విద్యుత్


తడిచిన సామగ్రిని ఆరబెట్టిన దృశ్యం



పశువులు మృత్యువాత

భారీ వరదకు ఆయా గ్రామాల్లోని వందలాది పశువులు మృత్యువాత పడ్డాయి. మరెన్నో కొట్టుకుపోయాయి. గ్రామా ల్లోని ఇళ్ళ వద్ద కట్టేసిన పశువులు తప్పించుకునే వీలులేక ఎక్కడికక్కడ మృతి చెందాయి. పూచిరాల గ్రామంలో ఒక చెట్టుకు జంటెద్దులు చిక్కుకుని వరదలో మునిగిపోయి మరణించగా నాళ్ళవరం కాలనీ సమీపంలో కొండవాగు పొర్లడం తో మేతకు వెళ్ళిన పశువులు వరదలో కొట్టుకుపోయి సమీ పంలో ఉన్న గోదావరిలోకి వెళ్ళిపోయాయి. వీటి ఆచూకి ఇంత వరకు లభించకపోవడంతో రైతులు తమ పశువుల జాడ కోసం వెతుకులాట ప్రారంభించారు.

నేలకొరిగిన 17 విద్యుత్ స్తంభాలు

కుక్కునూరు, వేలేరుపాడు మధ్య గుల్లవాయి వద్ద విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తీగలు తెగిపడ్డాయి. శుక్రవారం ఉదయం నుంచి విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. తిరిగి విద్యుత్ పోల్స్ ఏర్పాటుచేసి సరఫరా చేస్తున్నారు. కుక్కునూరు మండలంలో దాదాపు 35 గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



ప్రజలను ఆదుకుంటాం : ఎమ్మెల్యే బాలరాజు

వేలేరుపాడు : పెదవాగు వరదలకు నష్టపోయిన ప్రజలను ఆదుకుంటామని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు హామీ ఇచ్చారు. మేడేపల్లి, కమ్మరిగూడెం, అల్లూరినగర్, కోయమాదారం గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి బాధితులతో మాటాడారు. ఏటా పెదవాగు వరదల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నామని తమకు పరిహారం చెల్లించి వేరేచోట గృహాలు నిర్మించి ఇస్తే అక్కడికికి వెళ్లిపోతామని అల్లూరి నగర్ వాసులు మొరపెట్టుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ఈ గ్రామాన్ని ఇక్కడ నుంచి తరలించేందుకు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బాధితులకు ఆహార పొట్లాలు అందించారు. జనసేన నాయకులు గణేశుల ఆదినారాయణ, మేతినేని సంజయ్, సుధాకర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



దటీజ్ వెట్రి సెల్వి

జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి పెద్దవాగు ప్రాజెక్టు వరదల్లో భారీగా దెబ్బ తిన్న గ్రామాల్లో శుక్రవారం ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, జేసీ లావణ్యవేణితో కలిసి రోజంతా పర్యటించారు. వరద ఉధృతికి రోడ్లన్నీ కొట్టుకుపోవడంతో వాహనాలు వెళ్ళే పరిస్థితి లేకపోయినా కొంతలో కొంత సాహసించి అల్లూరినగర్‌తోపాటు మరికొన్ని గ్రామాల్లోనూ పర్యటించారు. బాధితులను కలిసి భయం లేదు.. మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. ఇంకా వర్షాలు పడే అవకాశం ఉన్నందున తక్షణం సహాయ కేంద్రాలకు రావాల్సిందిగా గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఎక్కడికక్కడ వరద కారణంగా తాము ఎలా నష్టపోయింది స్థానికులు వివరించినప్పుడు కలెక్టర్ సావధానంగా ఆలకిస్తూనే మీకెలాంటి లోటు రానివ్వం అంటూ సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఆయా గ్రామాలన్నింటిలోనూ ఎలాంటి సహాయ చర్యలు తీసుకుంటున్నది అడిగి తెలుసుకున్నారు. పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడిన ప్రాంతానికి తన గన్‌మేన్ సాయంతో ప్రమాదభరిత మార్గంలో బైక్ మీద ప్రయాణించారు. ప్రాజెక్టుకు ఎక్కడ గండి పడిందో స్వయంగా చూశారు. ప్రాజెక్టు మరమ్మతుకు ఎలాంటి చర్యలు తీసుకోవచ్చో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ లోపే వివిధ గ్రామాల్లోని నిండు గర్భిణులు, బాలింతలను వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సురక్షితంగా చేరవేసేలా జాగ్రత్తలు తీసుకున్నారు. మరోవైపు ఆహారం అందని గ్రామస్తులకు వెను వెంటనే మండల కేంద్రంలోనే భోజనాలు వండించి పంపించారు. నిలిచిన విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అధికారులను ఆగమేఘాల మీద రంగంలోకి దింపారు. పర్యటనలో తన వెంట వున్న ఐటీడీఏ అధికారులకు, స్థానిక అధికారులకు ఎక్కడికక్కడ తక్షణ ఆదేశాలు ఇచ్చారు. దీంతో వరద ఉధృతికి ఒరిగిన స్థంభాలను శుక్రవారం సాయంత్రానికే కొన్నింటిని యథాస్థానంలో నిలుపగలిగారు. కాగా నేడు వేలేరుపాడు మండలంలో పెదవాగు వరద ముంపు గ్రామాల్లో మంత్రి కొలుసు పార్థసారథి పర్యటించనున్నారు.


లక్ష్మవరం పంగిడిగూడెం రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

తగ్గని వాన

- పొంగుతున్న కొండ వాగులు
- ఎర్రకాలువకు భారీ వరద.. ఉధృతంగా తమ్మిలేరు
- గిరిజన గ్రామాలు విలవిల.. ఆందోళనలో ప్రజలు
- రోడ్లపై ఎటు చూసినా నీళ్లే.. నిలిచిన రాకపోకలు
- పాడైన రహదారులు.. మునిగిన పొలాలు

ఏలూరు సిటీ/జంగారెడ్డిగూడెం/ బుట్టాయగూడెం/జంగారెడ్డిగూడెం/ పోలవరం/కొయ్యలగూడెం/ చింతలపూడి/చాట్రాయి, జూలై 19 : ఆటవీ ప్రాంతంలో అధిక వర్షం కారణంగా కొండవాగులు ఉధృతి తగ్గలేదు. కొండవాగుల ఉధృతికి గ్రామాల్లో రహదారులు, కల్వర్టులు, లోలెవల్ వంతెనలు, విద్యుత్ స్తంభాలు కొట్టుకుపోయాయి. పూచికగొంది, రెడ్డిబోడ్డేరు, చింతకొండ, గొట్టాల రేవులో గురువారం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారంలో మగ్గుతున్నాయి.వాగులపై వున్న కల్వర్టులు, వంతెనలకు తుక్కు అడ్డుపడి నీరు వెళ్ళకపోవడంతో జేసీబీల సాయంతో తొలగించారు. గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద భక్తులు నిలిచిపోగా ఆలయ కమిటీ, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై కామవరంలోని పాఠశాల, పంచాయతీ కార్యాలయం, దొరమామిడి ఆశ్రమ పాఠశాలకు తరలించి భోజన ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం అల్పాహారం అనంతరం సుమారు 350 మంది భక్తులను వాహనాల్లో ఇళ్లకు తరలించారు. వర్షాల కారణంగా ఆదివారం వరకు ఆలయానికి వెళ్లే రహదారిలో కామవరం వద్ద నిర్మించిన గేట్లను మూసి వేస్తున్నట్టు ఆలయ కమిటీ ఛైర్మన్, కోర్సవారి గూడెం సర్పంచ్ కోర్స గంగరాజు తెలిపారు. రెడ్డిగణపవరం జల్లేరు వాగువద్ద బుట్టాయగూడెం ఎస్సై వెంకన్న పర్యవేక్షిస్తూ రాకపోకలను నిలుపుదల చేశారు.


ఉంగుటూరు మండలంలో ముంపు బారిన పామాయిల్ తోట

కొనసాగుతున్న నీటి విడుదల

గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం నుంచి రెండో రోజు నీటి విడుదల కొనసాగింది. గురువారం 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు రెండో రోజు అధికారుల ఆదేశాలతో 500కు తగ్గించారు. జలాశయానికి ఇన్ ఫ్లో వెయ్యి క్యూసెక్కులు ఉన్నట్టు ఏఈ సురేష్ తెలిపారు. జలాశయంలో నీటిమట్టం 215.60 ఎంటీఎస్‌గా ఉందన్నారు.

ఎర్రకాల్వ జలాశయం ఉగ్రరూపం

జంగారెడ్డిగూడెం మండలంలోని శ్రీ కరాటం కృష్ణమూర్తి ఎర్రకాల్వ జలాశయం ఉగ్రరూపం దాల్చడంతో గేట్ల ద్వారా నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. పుట్లగట్లగూడెం, లక్ష్మవరం, పంగిడిగూడెం, తదితర గ్రామాలకు చెందిన వేల ఎకరాల వరి పంటలు నీట మునిగాయి. ఎర్రకాల్వ ప్రాజెక్టు నీటిమట్టం 83.50 మీటర్లు కాగా శుక్రవారానికి 82.50 మీటర్లకు చేరింది. గురువారం మధ్యాహ్నానికి 12 వేల 919 క్యూసెక్కులు వరద నీటిని దిగువకు విడిచిపెట్టినట్టు డీఈ రాంబాబు తెలిపారు. పట్టెన్నపాలెం బ్రిడ్జి వద్ద జల్లేరు వాగు, బైనేరు వాగులు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచి పోయాయి. జిల్లా ఇరిగేషన్ శాఖ ఎస్ఈ దేవప్రకాశ్ ఎర్రకాల్వ జలాశయాన్ని శుక్రవారం సందర్శించారు. పోలవరం మండలం గుంజవరం, పేద్రాల కాల్వలు పొంగుతున్నాయి. ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్‌లోకి కొండవాగుల జలాలు వచ్చి చేరుతున్నాయి. ఎల్ఎన్‌డీపేట రిజర్వాయర్ సామర్థ్యం 90.05 టీఎంసీలు కాగా ప్రస్తుతం రిజర్వాయర్‌లో 87.35 టీఎంసీ జలాలు ఉన్నాయని ఏఈ కొండలరావు తెలిపారు. గూటాల రెవెన్యూ పరిధిలో కొవ్వాడ ప్రధాన కాల్వకు రెండు కిలోమీటర్ల మేర పూడికతీత పనులు చేయకపోవడంతో కొవ్వాడ కాలువ జలాలు పంటపొలాల్లోకి ప్రవహించి రెండువేల ఎకరాల వరి చేలు నీటమునిగాయి. ఎర్రకాల్వ జలాశయం గేట్లు ఎత్తి వేయడంతో ఎర్రకాల్వ ఉధృతంగా ప్రవహిస్తోంది. రాజవరం వరద నీరు పంట పొలాల్లోకి చేరడంతో వరి పొలాలు నీట మునిగాయి. బయ్యన్నగూడెం ప్రాంతంలో చేలన్నీ నీట మునిగాయి. కొయ్యలగూడెం లోతట్టు ప్రాంతాల్లో చేరిన వర్షపు నీటిని అధికారు లు తొలగిస్తున్నారు. కన్నాపురం, పడమటి, తూర్పు కాల్వలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.


రెడ్డిగణపవరం జల్లేరు వాగు ఉధృతి

తమ్మిలేరుకు కొనసాగుతున్న వరద

చింతలపూడి సమీపంలోని నాగిరెడ్డిగూడెం వద్ద ఉన్న తమ్మిలేరు రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రానికి 341.68 అడుగుల నీటిమట్టం చేరినట్టు ఏఈఈ పరమానందం తెలిపారు. ఎగువ నుంచి 3,749 క్యూసెక్కుల వరదనీరు వస్తోంది. 348 అడుగుల నీటి మట్టం చేరుకున్నాక నీటిని దిగువకు విడుదల చేస్తారు. రిజర్వాయర్ కెపాసిటీ మూడు టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.026 నీరు చేరింది. ఏలూరులో తమ్మిలేరు వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను ఆర్డీవో పరిశీలించారు.

వేలేరుపాడులో 26.9 సెంటీమీటర్ల వర్షపాతం

బగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారడంతో జిల్లావ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గడచిన 24 గంటల్లో వేలేరుపాడు మండలంలో 26.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బుట్టాయిగూడెం 268.8 మి.మీ, కుక్కునూరు 178.8, జంగారెడ్డిగూడెం 168, జీలుగుమిల్లి 141.2, కొయ్యలగూడెం 132.8, పోలవరం 120.6, కామవరపుకోట 117.6, చింతలపూడి 115.2, టి.నరసాపురం 109.6, దెందులూరు 109.2, పెదవేగి 107.4, ద్వారకాతిరుమల 101.6, లింగపాలెం 101.4 మి.మీ, నిడమర్రు 96.6, ఉంగుటూరు 91.2, భీమడోలు 67, నూజివీడు 64.6, చాట్రాయి 57.8, ముసునూరు 48, ఏలూరు అర్బన్ 45.8, ఏలూరు రూరల్ 44.2, కైకలూరు 43.4, పెదపాడు 41.6, కలిదిండి 40.4, ముదినేపల్లి 33.8, మండవల్లి 31.2, ఆగిరిపల్లి 28.6 మి.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలు, ఎర్రకాల్వ, తమ్మిలేరు వరదల కారణంగా జిల్లాలో వరి నారుమళ్లు, వరి నాట్లు కలిపి మొత్తం 4,427 ఎకరాల్లో వరి పంట నీటి ముంపునకు గురైంది.

మాధవాయిపాలెం రేవు పాట రద్దు

నరసాపురం రూరల్, జూలై 19: మాధవాయిపాలెం- సఖినేటిపల్లి రేవు పాట ఈనెల 21న జరగాల్సిన నేపథ్యంలో రద్దు చేస్తున్నట్టు అధికారులు శుక్రవారం తెలిపారు. ఈనెల 8న మూడో సారి టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. పాట ప్రారంభ ధర రూ 3.61 కోట్లుగా నిర్ణయించారు. పాటదారులెవ్వరూ శుక్రవారం సాయంత్రానికి ఒక్క షెడ్యూల్ కొనుగోలు చేయలేదు. దీంతో పాటను రద్దు చేశారు. ప్రారంభ ధర తగ్గించి తిరిగి పాట ఎప్పుడు నిర్వహించాలన్నది త్వరలో ప్రకటిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు.

రేపటి నుంచి నరసాపురం-డోన్ రైలు పునరుద్ధరణ

నరసాపురం, జూలై 19: నరసాపురం- డోన్‌ల మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 21 నుంచి పునరుద్ధరిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ట్రాక్ మరమ్మతు పనులు కారణంగా ఈ రైలును మూడు నెలలుగా నిలిపివేశారు. 17282 నంబర్‌తో ఈ రైలు నరసాపురంలో ఉదయం ఆరు గంటలకు బయలుదేరి విజయవాడ-గుంటూరు మార్కాపురం, నంద్యాల మీదుగా రాత్రి తొమ్మిది గంటలకు డోన్ చేరుకుంటుంది. జిల్లా నుంచి శ్రీశైలం వెళ్లే ప్రయాణికులకు ఈ రైలు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. మార్కాపురంలో దిగి అక్కడ నుంచి బస్సు మార్గంలో శ్రీశైలం వెళుతుంటారు. కర్నూల్, నంద్యాల వెళ్లే జిల్లా ప్రయాణికులు ఈ రైలునే ఆశ్రయిస్తారు.

ప్రభుత్వ ఐటీఐ కాలేజీల్లో
రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు

ఉండి జూలై 19: జిల్లాలోని రెండు ప్రభుత్వ ఐటీఐ కాలేజీల్లో 2024-25విద్యా సంవత్సరానకు రెండో విడత ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఉండి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వేగేశ్న శ్రీనివాసరాజు ఓ ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 24 సాయంత్రం ఐదు గంటల లోపు ఆన్‌లైన్‌లో పోర్టల్ నందు రిజిస్ట్రేషన్ చేయించుకుని తప్పనిసరిగా ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకుని రశీదు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐ ఉండి 08816-297093, 96760 99988 నంబర్లలో సంప్రదించాలని కోరారు. పదో తరగతి ఫెయిలైన వారికి వెల్డర్ ఒక ఏడాది ట్రేడ్ నందు అవకాశం కలదని ప్రిన్సిపాల్ తెలిపారు.




వెంకచేజెర్ల శ్రీనివాస్, మరుముకం శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు బాండులు అందజేస్తున్న అధికారులు

శ్రీవారి ట్రస్టుకు రూ.4.28 లక్షల విరాళం

ద్వారకాతిరుమల, జూలై 19: చిన వెంకన్న నిత్యాన్నదాన ట్రస్టునకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా రూ.4.28 లక్షలను శుక్రవారం విరాళంగా అందజేశారు. ఏలూరు సమీపంలోని పినకడిమికి చెందిన వెంకచేజెర్ల శ్రీనివాస్ రూ.3.12 లక్షలు. కామవరపుకోట మండలం కళ్లచెరువుకు చెందిన మరుముకం శ్రీనివాస్ మరో రూ.1.16లక్షలు మొత్తం రూ.4.28 లక్షలు నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. వారికి స్వామి వారి దర్శన అనంతరం సూపరింటెండెంట్ నరసింహరాజు బాండు పత్రాలను అందించారు.

వీడని ఎంపీడీవో అదృశ్యం మిస్టరీ

- కొనసాగుతున్న గాలింపు
- నరసాపురంలో కృష్ణా జిల్లా పోలీసులు విచారణ
- మాజీ ఎమ్మెల్యే ముదునూరిని కేసులో ఇరికించేందుకు కుట్ర
- వైసీపీ నాయకుల ఆరోపణ



ఎంపీడీవో కార్యాలయంలో విచారణ చేస్తున్న సీఐ బాషా

నరసాపురం రూరల్, జూలై 19: నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ అదృశ్యం ఇంకా మిస్టరీగానే మిగిలింది. శుక్రవారం సాయంత్రం వరకు ఆయన ఆచూకీ చిక్కలేదు. విజయవాడ పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి లోతైన విచారణ చేపట్టారు. మరో వైపు ఈకేసు మిస్టరీగా మారింది. ఎంపీడీవోకు ఫోన్ చేసి బెదిరించి ఎకౌంట్‌లోకి లక్షలాది రూపాయలు బదిలీ చేయించుకున్నది ఎవరనేది సస్పెన్స్‌గా మారింది. ప్రస్తుతం దీనిపైనే ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇటు పోలీసులు కూడా ఈ చిక్కుముడిని ఛేదించేందుకు కాల్‌డేటా ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

కృష్ణా జిల్లా పోలీసుల విచారణ

మరోవైపు కృష్ణా జిల్లా పోలీసులు విచారణ నిమిత్తం నరసాపురం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా ఆధ్వర్యంలో విచారణ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో రేవుకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. వివరాలను ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు, ఎంపీపీ సోని, సిబ్బంది నుంచి ఆరా తీశారు. ఆయనకు ఫోన్‌లు ఎక్కడ నుంచి వచ్చేవి, ఆర్థిక పరిస్థితి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాకీ ఎప్పటి నుంచి కట్టాల్సి ఉంది, దానికి సంబంధించి పాటదారుడికి ఎంపీడీవో వెంకటరమణ ఇచ్చిన నోటీసులను పరిశీలించారు. విచారణలో స్థానిక సీఐ స్వామి పాల్గొన్నారు.

ఈ కేసును రాజకీయం చేస్తున్నారు..

అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాలని వైసీపీ నాయకుల డిమాండ్

ఎంపీడీవో అదృశ్యంపై తమ పార్టీ నేతలపై వస్తున్న ఆరోపణలపై వైసీపీ నాయకులు శుక్రవారం స్పందించారు. పార్టీ కార్యాలయంలో జడ్పీటీసీ రాధాకృష్ణ, ఎంపీపీ సోని, సీనియర్ నాయకులు వైకేఎస్, కామన బుజ్జి, షేక్ బుల్లిమస్తాన్ విలేకర్లతో మాట్లాడారు. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే ముదునూరిని ఇరికించేందుకు టీడీపీ, జనసేన పార్టీలు కుట్ర చేస్తున్నాయన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత ఎంపీడీవో వెంకటరమణ బాధ్యతలు చేపట్టారన్నారు. ఈ కారణంగా ఒక్కసారి కూడా రేవుకు సంబంధించిన బకాయిల కోసం ఫోన్ చేయలేదని.. అవసరమైతే ముదునూరి కాల్ డేటాను పరిశీలించుకోవచ్చున్నారు. ఈ కేసును అన్ని కోణాల్లో విచారించాలని డిమాండ్ చేశారు. పాటదారుడు ధవేజీ త్వరలో ఈ సొమ్మును చెల్లిస్తారని, అతడి పంటు ప్రభుత్వ ఆధీనంలోనే ఉందన్నారు. నిజాయతీపరుడైన ఎంపీడీవో క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నామన్నారు. సమావేశంలో పీడీ రాజు, జయ, మురళీ, శంకర్ తదితరలుఉ పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి

- భద్రాచలం వద్ద 27.50 అడుగులకు చేరిన నీటిమట్టం
- స్పిల్వే నుంచి 3.60 లక్షల క్యూసెక్కులు విడుదల
- ధవళేశ్వరం నుంచి 3.46 లక్షల క్యూసెక్కులు విడుదల



పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గోదావరి జలాలు

పోలవరం/ కుక్కునూరు/ఏలూరు క్రైం/ఏలూరు సిటీ జూలై 19 : ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి వరద పెరుగుతోంది. శుక్రవారం రాత్రి తొమ్మిది గంటల సమయానికి అక్కడ గోదావరి నీటిమట్టం 27.50 అడుగులకు చేరుకుంది. రాత్రికి 30 అడుగులకు చేరుకునే అవకాశం ఉందని తెలంగాణ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. ఈ క్రమంలో లోతట్టు ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని కుక్కునూరు తహసీల్దార్ కోరారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న 3,60,021 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్టు ఈఈ మల్లికార్జునరావు తెలిపారు. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం పెరగడంతో 175 గేట్లు ఎత్తి 3.46 లక్షల క్యూసెక్కుల వరద జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. స్పిల్‌వేలోకి మరో ఐదు లక్షల క్యూసెక్కుల జలాలు రానున్నట్లు అధికారులు తెలిపారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో ఎగువ కాఫర్ డ్యాం బ్యాక్ వాటర్ లెవెల్ పెరిగి కాఫర్ డ్యాంకి సమీపంలో వున్న గండి పోశమ్మ ఆలయంలోకి వరద జలాలు ప్రవేశించాయి. అధికారులు ఆలయానికి రాకపోకలు నిలిపివేశారు.



పోలవరంలో గండి పోశమ్మ ఆలయంలోకి చేరిన వరద నీరు

పోలీస్‌శాఖ అప్రమత్తం

వాతావరణంలోని పెనుమార్పుల వల్ల జిల్లాలో రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురవడంతో గోదావరి నదీపరివాహక ప్రాంతాలు, కాల్వలు, వంకలు, వాగులు పొంగిపొర్లు తున్నాయి. జిల్లాలోని కొన్ని గ్రామాలకు వెళ్లే మార్గాలు కూడా వరదలతో సంబంధాలు తెగిపో యాయి. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ శుక్రవారం మేడేపల్లి, వసంతవాడ, గొల్లవాయి, కుమ్మరిగూడెం, అల్లూరి నగర్‌లలో పోలీసు అధికారులతో కలిసి పర్యటించారు. అక్కడ ప్రజల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గత వరదల సమయంలో ఉన్న అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలోని సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. రహదారులపై ఎక్కడైనా చెట్ల కొమ్మలు పడిపోయి ట్రాఫిక్‌నకు అంతరాయం కల్గిస్తే తక్షణం వాటిని తొలగించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. మరోవైపు తమ్మిలేరు కాల్వకు వరద రావడంతో ఇప్పటికే ఏలూరు నగరంలో రెండు పాయలుగా చీలిపోయిన ప్రాంతాలను సంబంధిత స్టేషన్‌పరిధిలోని అధికారులు పరిశీలిం చారు. తూర్పు లాకుల ప్రాంతం, తంగెళ్ళమూడి బ్రిడ్జి, శనివారపు పేట లోబ్రిడ్జిలను అధికారులు పరిశీలించారు. ఒకవేళ శనివారపుపేటలో బ్రిడ్జిపై నీరు ప్రవహించే అవకాశం ఉంటే రెండువైపులా మార్గాన్ని మూసి వేయడానికి పోలీసులు ముందస్తుగా స్టాపర్లను సిద్ధం చేస్తున్నారు. మొత్తం మీద జిల్లాలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా చర్యలు చేప ట్టింది.



జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి ఎలుకల కాల్వ వద్ద కొట్టుకు పోయిన కల్వర్టు

ఆ రెండు మండలాల్లో గర్భిణుల తరలింపు

ఏలూరు జిల్లాలో ఆకస్మిక వరదల ధాటికి కుదేలవుతున్న కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా శుక్రవారం 14 మంది గర్భిణులను సమీప మండలాల్లోని పీహెచ్‌సీలకు తరలించి పర్యవేక్షిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట వెల్లడించారు. వీరిలో 11 మంది ఆగస్టులో డెలివరీ అయ్యే అవకాశాలున్న గర్భిణులను శనివారం జంగారెడ్డిగూడెం సీహెచ్‌సీకి తరలిస్తామన్నారు. అన్ని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని, వర్షాలు తగ్గిన వెంటనే అంటువ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా పంచాయతీరాజ్‌శాఖను సమన్వయం చేసుకుని సేవలు అందిస్తామన్నారు. వేలేరుపాడు మండలానికి చెందిన సునీత అనే గర్భిణిని, మరో తొమ్మిది నెలలు నిండిన గర్భిణిని అంబులెన్సు ద్వారా వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కె.పద్మావతి తెలిపారు. మండలంలోని 12 నివాసిత ప్రాంతాల్లోని 31 మంది గర్భిణులను, 27 మంది బాలింతలను గుర్తించామని వారికి అవసరమైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.



శిశువుకు జన్మనిచ్చిన రామవరం మహిళ

చిన్నారికి జన్మనిచ్చిన రామవరం మహిళ

ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వరద ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో పెదవాగు పరివాహక ప్రాంతంలో ముంపునకు గురైన రామవరం గ్రామానికి చెందిన గర్భినిని వేలేరుపాడు పీహెచ్‌సీకి తరలించగా శిశువుకు జన్మనిచ్చింది. పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ అగత, ఏఎన్ఎం ఎస్తేరు మాట్లాడుతూ తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు.




వేలేరుపాడు పీహెచ్‌సీకి అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది.. పీహెచ్‌సీలో గర్భిణులు

ముంపు చేలకు సస్యరక్షణ సూచనలు

- పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు



మొగల్లు శివారు నారుమళ్లలో నిలిచిన నీరు

భీమవరం రూరల్, జూలై 19 : ముంపునకు గురైన నారుమడులు, నాట్లు వేసిన చేలకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. నారుమడి దశలో ఉన్న వరి పంట విత్తనం చల్లి 2-3 రోజుల వయసులో ఉన్నప్పుడు మూడు రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే మొలక శాతం బాగా తగ్గుతుంది. కాబట్టి రైతులు ఈ దశలో వీలైనంత త్వరగా నీళ్ల పూర్తిగా బయట తీసివేయాలి. నారుమడి ఐదు రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బ తినే అవకాశం ఉంది. నీట మునిగిన ఐదు రోజుల లోపు నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలా చేయాలి. తర్వాత ఐదు సెంట్లు నారు మడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవడం వల్ల కొత్త ఆకు వచ్చి నాట్లు వేసేందుకు అందివస్తుంది. వర్షాల వల్ల నారుమడిలో తెగుళ్ళు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. నీటిని పూర్తిగా బయటకు తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తరువాత తెగుళ్ల నివారణకు ఒకటి లేదా రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెబ్ మిశ్రమం ఒక లీటరు నీటికి కలిపి పైపాటుగా పిచికారీ చేసుకోవాలి.

ఊడ్చిన నేలలో..

ఊడ్చిన చేలో నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పైపాటుగా ఒక ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ బూస్టర్ డోస్‌గా వేసుకోవాలి. నీరు పూర్తిగా తీయలేని పక్షంలో ఆకుపై రెండు శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారీ చేయాలి. వరి పూర్తిగా కోలుకున్న తరువాత మాగుడు తెగులు, ఇతర కుళ్ల సోకకుండా ఒకటి లేదా రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెబ్ మిశ్రమం ఒక లీటరు నీటికి కలిపి పైపాటుగా పిచికారీ చేసుకోవాలి.

వెదజల్లిన చేలలో..

విత్తనం చల్లిన వెంటనే అధిక వర్షాల వల్ల విత్తనాలు కుప్పగా చేరి గింజలు లోతుగా వెళ్లి పైన మట్టి కప్పబడడం వల్ల నీరు తీయలేని పరిస్థితుల్లో మొలక శాతం దెబ్బ తింటుంది. వర్షాలు తగ్గిన వెంటనే నీటిని పూర్తిగా బయటకు తీయాలి. విత్తనం 10 నుంచి 30 రోజుల లోపు ఐదు రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే వరి దెబ్బతినే అవకాశం ఉంది. నీట మునిగిన ఐదు రోజుల్లోపు నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలా చేయాలి. పైపాటుగా ఒక ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ బూస్టర్ డోస్‌గా వేసుకోవాలి.

వేడుకగా వందేళ్ల గంధర్వ మహల్ ఉత్సవాలు

ఆచంట, జూలై 19 : ఆచంటలో వందేళ్ల క్రితం గొడవర్తి వారి కుటుంబ సభ్యులు నిర్మించిన గంధర్వ మహల్ నేటికీ చెక్కు చెదరకుండా ఉండడం అనేది భవనం విశిష్టతకు నిదర్శనమని మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంటకు చెందిన గొడవర్తి నాగేశ్వరరావు నిర్మించిన గంధర్వ మహల్ వందేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం వేడుకగా ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పితాని శిలాఫలకం ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. పూర్వపు రోజుల్లో పెద్ద కుటుంబాల వారు ఇటువంటి భవనాలు నిర్మించేవారని వందేళ్ల అనంతరం మళ్లీ ఆ భవనానికి ప్రారంభోత్సవం చేయడం మంచి కార్యక్రమం అన్నారు. రానున్న రోజుల్లో కుటుంబ సభ్యులందరూ మంచి ఆయురారోగ్యాలతో రాజకీయంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని దీవించారు. అనంతరం కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకుడు గంధర్వ మహల్ కుటుంబ సభ్యుడు గొడవర్తి శ్రీరాములు జన్మదిన వేడుకలు కూడా పితాని ఆధ్వర్యంలో నిర్వహించారు. మహల్ ఎదుట పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మహల్ కుటుంబ సభ్యులైన గొడవర్తి శ్రీరాములు, విద్యా సాగర్, నాగేశ్వరరావు, గొడవర్తి వెంకన్నబాబుతోపాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



గంధర్వ మహల్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని

జేఎన్టీయూకే అభివృద్ధికి కృషి చేస్తా..

- ఇన్‌చార్జి ఉపకులపతిగా ప్రొఫెసర్ మురళీకృష్ణ బాధ్యతలు



మురళీకృష్ణను అభినందిస్తున్న మాజీ వీసీ ప్రసాదరాజు, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ ఉదయ్‌భాస్కర్

జేఎన్‌టీయూ, జూలై 19: కాకినాడ జేఎన్టీయూకే అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఇన్‌చార్జి ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించడంతోపాటు కాలానుగుణంగా ఇంజనీరింగ్ విద్యలో వస్తున్న మార్పులను అనుసరించి బోధన ఉండేలా ప్రణాళిక చేపడతామన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి సౌరబ్‌గౌర్, ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ రామ్మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ ఉపకులపతులు, వర్సిటీ అధికారులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, మాజీ ఉపకులపతులు జీవీఆర్ ప్రసాద రాజు, శ్రీనివాసకుమార్, పద్మరాజు, రిజిస్ట్రార్ సుమలత, మాజీ రిజిస్ట్రార్‌లతో ఇన్‌చార్జి వీసీ సమావేశం నిర్వహించి విశ్వవిద్యాలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు ఆల్‌టైమ్ రికార్డు ధర రూ.389



జంగారెడ్డిగూడెం, జూలై 19 : వర్జీనియా పొగాకు ధరలు రోజురోజుకు పైపైకి పెరుగుతుండడంతో రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. శుక్రవారం పట్టణంలోని 32వ ఆక్షన్ ప్లాట్ ఫారంలో కిలో పొగాకు ధర రూ. 389కి చేరింది. మరో ప్లాట్ ఫారం 18లో కిలో పొగాకు ధర రూ.388కి చేరింది. దీంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. మునుపెన్నడూ వర్జీనియా పొగాకుకు ఇంతటి ధర రాలేదని ఇది ఆల్‌టైమ్ రికార్డు ధర అని వేలం అధికారులు తెలిపారు.

నకిలీ యాప్‌తో భారీ స్కాం !

- సుమారు రూ.50 లక్షల వరకు నష్టపోయిన బాధితులు

భీమవరం క్రైం, జూలై 19: ఆన్‌లైన్‌లో యాప్‌ల ద్వారా సులభంగా డబ్బు సంపాదించవచ్చుననే ఆశతో చాలా మంది మోసపోతూనే ఉన్నారు. అలాంటి సంఘటన భీమవరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఈ ఏడాది జనవరిలో ఎస్ఎంవో అనే పేరుతో ఒక యాప్ గూగుల్ ప్లేస్టోర్‌లో వచ్చిందని, అది కూడా ఒక జాతీయ బ్యాంకు నమూనాతో ఉన్న కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో ఉంచడంతో అది డౌన్‌లోడ్ చేసుకుని చాలా మంది డబ్బు చెల్లించారు. అత్యధిక వడ్డీ వస్తుందన్న నమ్మకంతో లక్షల్లో కూడా డబ్బులు పెట్టుబడులు పెట్టారు. దానితో పాటు శ్యామ్‌సంగ్ మరికొన్ని బ్రాండ్‌లు కూడా అందులో చూపించారని చెబుతున్నారు. ఈ వ్యవహారంలో సుమారు రూ.50 లక్షలు వరకు యాప్ ద్వారా పెట్టుబడులు పెట్టామని బాధితులు చెబుతున్నారు. జిల్లాలోని తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, నరసాపురంతో పాటు ఏలూరు, కాకినాడ జిల్లాల్లో కూడా బాధితులు ఉన్నట్టు చెబుతున్నారు. దీనిపై భీమవరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు తీసుకుని వివరాలు సేకరిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఇంకా కేసు నమోదు చేయలేదని తెలిపారు.

ఆగస్టు 30 వరకు భీమడోలులో 'రాయగడ' ఆగదు



భీమడోలు, జూలై 19 : రైల్వే ట్రాక్‌ల మరమ్మతుల నేపథ్యంలో భీమడోలు రైల్వే స్టేషన్‌లో నిలిచే గుంటూరు, రాయగడ, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లు ఆగస్టు 30 వరకూ రాకపోకలు నిలిపి వేసినట్టు భీమడోలు రైల్వే అధికారులు తెలిపారు. ట్రాక్ మరమ్మతులు నేపథ్యంలో కొన్ని నెలలుగా సుమారు 15 రైళ్ల రాకపోకలు నిలిపి వేస్తున్నట్టు తెలిసిందే. ఈ నేపథ్యంలో భీమడోలులో నిలిచే రాయగడ, సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను కూడా ఆగస్టు 30 వరకు ఆగవని అధికారులు తెలిపారు.

క్రైం కార్నర్

చిన్నారిని కొట్టి చంపిన కానిస్టేబుల్ అరెస్ట్

లింగపాలెం, జూలై 19 : కుటుంబ కలహాల నేపథ్యంలో రెండు నెలల చిన్నారిని కొట్టి చంపిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఎం.సుధాకర్, ఎస్ఐ పి.చెన్నారావు తెలిపిన వివరాలివి.. తొమ్మండ్రుగూడెంకు చెందిన దివ్యను ప్రేమవివాహం చేసుకున్న సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ చెల్లాపాటి బాలాజీ కొన్నేళ్లుగా భార్యతో గొడవలు పడుతున్నాడు. విడాకుల కోసం దరఖాస్తు చేసుకుని గతవారం కోర్టు వాయిదా నిమిత్తం ఏలూరు న్యాయస్థానానికి వెళ్లివస్తుండగా భార్య, మామతో గొడవపడ్డాడు. అనంతరం తొమ్మండ్రుగూడెంలోని ఇంటికి వెళ్లి అక్కడ అత్తామరదళ్లపై దాడి చేశాడు. ఆవేశంలో రెండునెలల చిన్నారిపై వెదురుకర్రతో కొట్టడంతో ఆ చిన్నారి మరణానికి కారణమైన అతడిని ఏలూరులో అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచామని, ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసులో ముద్దాయికి ఆరునెలల జైలు

నరసాపురం/యలమంచిలి,జూలై 19 : దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్షను నరసాపురం ఏజేఎఫ్‌సీఎం జడ్జి ఆర్. వరలక్ష్మి శుక్రవారం విధించారు. ఈ ఘటనకు సంబంధించి కోర్టు లైజన్ ఏఎస్ఐ ఉదయ భాస్కరరావు తెలిపిన వివరాలివి.. యలమంచిలి మండలం గుంపర్రు గ్రామానికి చెందిన జద్దు శ్రీనివాసరావు తన తల్లికి వైద్యం నిమిత్తం 2023 డిసెంబరు పదో తేదీన ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. తిరిగి ఆదేనెల 15వ తేదీన ఇంటికి వచ్చే సరికి ఇంటి వెనక గుమ్మం తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి ఇల్లును పరిశీలించగా ఇంటిలో భద్రపరిచిన బంగారం, వెండి వస్తువులు తస్కరించినట్టు గుర్తించి యలమంచిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేరంపై యలమంచిలి ఏఎస్ఐ కె.నాగేశ్వరరావు కేసు నమోదుచేయగా ఎస్ఐ కె.శివన్నారాయణ క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ నివేదిక ఆధారంగా పూలపల్లిలో నివాసం ఉంటున్న వీరవాసరం మండలం బొబ్బనపల్లికి చెందిన కట్టా సుబ్బారావు దొంగిలించినట్టుగా గుర్తించి బంగారం, వెండి వస్తువులు రికవరీ చేసి ముద్దాయిని అరెస్ట్ చేశారు. కోర్టు సాక్షులను విచారించి నేరం రుజువు కావడంతో ముద్దాయి సుబ్బారావుకు ఆరు నెలలు జైలు శిక్షను న్యాయమూర్తి వరలక్ష్మి విధించారు. కోర్టు కానిస్టేబుల్ ఆశోక్ సాక్షులను కోర్టులో హాజరుపరచగా ఏపీపీ ఎంఏ అమీద్ వాదనలు వినిపించారు.

బియ్యం వ్యాపారి అనుమానాస్పద మృతి

భీమవరం క్రైం, జూలై 19 : బాకీల వసూలు నిమిత్తం వెళ్లిన బియ్యం వ్యాపారి గొంట్ల వెంకటనారాయణ(52) మృతదేహం లభ్యమైంది. వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. స్థానిక 18వ వార్డుకు చెందిన గొంట్ల వెంకట నారాయణ స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా బియ్యం వ్యాపారం చేస్తున్నాడు. బాకీల వసూళ్ల నిమిత్తం భీమవరం మండలంలోని పలు గ్రామాలకు వెళుతుంటారు. ఈ నేపథ్యంలో బుధవారం బాకీలు నిమిత్తం వెళ్లి తిరిగిరాలేదు. భార్య నారాయణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నాగిడిపాలెం గ్రామం వద్ద ఉప్పుటేరులో అతడి మృతదేహాన్ని కనుగొన్నారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఉండి జూలై 19: ఉండి మండలం అర్తమూరు శివారులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని పోలీసులు శుక్రవారం తెలిపారు. అర్తమూరు శివారు కవిటంపాకల గ్రామంలోని తల్లికోడు వద్ద గుర్తుతెలియని సుమారు 30 ఏళ్ల వయసు గల పురుషుడి మృతదేహం ఉందని స్థానిక వీఆర్‌వో శివరామకృష్ణంరాజు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మృతుడ నలుపు రంగు బనియన్ ధరించుకుని వున్నట్టు తెలిపారు. వీఆర్‌వో ఫిర్యాదు మేరక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

ఆర్టీసీకి ఏమైంది ?

- వాహనాల అతి వేగమా.. డ్రైవర్‌ల నిర్లక్ష్యమా.. ?
- నెల రోజుల్లో తాడేరులో మూడు ప్రమాదాలు

భీమవరం రూరల్, జూలై 19 : ఆర్టీసీకి ఏమైంది.. నెల రోజుల్లోనే భీమవరం మండలం తాడేరు గ్రామంలో మూడు ప్రమాదాలు జరిగాయి. ఆ ప్రమాదాలన్నింటిలో ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. దీనికి ఇరు వాహనాల వేగం కారణమా.. ? డ్రైవర్ల నిర్లక్ష్యమా తెలియడం లేదు. గ్రామస్తులకు ఈ ప్రమాదాలు చర్చనీయాంశంగా మారింది. 25 రోజుల క్రితం తాడేరు గ్రామంలో ఆర్టీసీ బస్సు కింద ఒక యువకుడు మోటార్‌సైకిల్ మీద వెళ్తూ పడి చనిపోయాడు. వారం రోజుల కిందట ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్నాయి. వెనుక భాగం తగలడంతో ప్రమాదం జరగలేదు. శుక్రవారం అదే ప్రదేశంలో ఆర్టీసీ బస్సు, మిని లారీ గట్టిగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మిని లారీ డ్రైవర్‌కు కాలు ఫ్యాక్చర్ అయ్యింది. లారీ ఎదుట భాగం దెబ్బతింది. ఈవిధంగా ప్రమాదాలు జరగడం ఆ ప్రాంతవాసుల్లో భయం నెలకొంది.



వారం రోజుల క్రితం లారీ ఆర్టీసీ బస్సు ఢీకొన్న దృశ్యం



శుక్రవారం మిని లారీ ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో దెబ్బతిన్న ముందు భాగం

పాఠశాలకు దారేది..?

పట్టెన్నపాలెం సర్పంచ్‌కు విద్యార్థి వాట్సాప్ లేఖ



పాఠశాలకు బురద రహదారి

జంగారెడ్డిగూడెం, జూలై 19: కుండపోత వర్షంతో పట్టెన్నపాలెం ప్రాథమిక పాఠశాల రహదారి ఛిద్రమైంది. కనీసం నడవడానికి కూడా అనువుగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు దారి చూపండి అంటూ ఐదో తరగతి విద్యార్థి ఫొటోతో గ్రామ సర్పంచ్‌కు వాట్సాప్‌లో లేఖ రాశాడు. బురదతో గొయ్యి, రోడ్డు స్పష్టత లేక పడిపోతున్నామని విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ వాట్సాప్ సందేశం స్థానికంగా పలు గ్రూప్‌లలో చక్కెర్లు కొడుతోంది. గ్రామంలో సాయిబాబా గుడి వద్ద నుంచి పాఠశాల వరకూ రోడ్డంతా బురదమయం కావడంతో విద్యార్థులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రోడ్లపై గోతుల్లో గ్రావెల్ పోయించి పూడ్చాలని గ్రామస్థులు, విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రహదారిపై కూలిన చెట్టు



ఏలూరు-చింతలపూడి రోడ్డుపై పడిన చెట్టు

లింగపాలెం, జూలై 19: ఏలూరు-చింతలపూడి రహదారిపై మండల పరిధిలో చెట్టుకూలింది. ఆ సమయంలో ఎవరూ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. స్థానిక అధికారులకు సమాచారం అందడంతో విరిగిపడిన చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

సహాయక చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే చంటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూటౌన్, జూలై 19: భారీ వర్షాల దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు సహాయక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్య వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనారోగ్య సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఖాళీ స్థలాల యాజమానులు తమ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా మెరక చేసుకోవాలన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ



నిత్యావసర సరుకులు అందిస్తున్న బొరగం

వేలేరుపాడు, జూలై 19: పెదవాగు ప్రాజెక్టు వరదతో నష్టపోయిన కమ్మరిగూడెం బాధితులకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్, నాయకులు శుక్రవారం వంటపాత్రలు, నిత్యావసర సరుకులను అందించారు. బొరగం మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వంతో మాట్లాడి తరచు పెదవాగు వరదకు నష్టపోతున్న గ్రామాన్ని తరలించే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నాయకులు అశోక్, వెంకటేశ్వరరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: వేలేరుపాడు మండలంలో దాదాపు 13గ్రామాలు వరద పోటుకు విలవిలాడుతున్నాయి. ప్రజలు దాహంతో అలమటిస్తున్నారు. టీడీపీ కుక్కునూరు మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు స్పందించి ట్యాంకర్ల ద్వారా బాధిత కుటుంబాలకు మంచినీరు అందించే ఏర్పాటు చేశారు. వేలేరుపాడు ముంపు బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు.

పాదచారులకు గొడుగుల పంపిణీ

ఏలూరు క్రైం, జూలై 19: ఆసుపత్రికి వర్షంలో తడుచుకుంటూ వచ్చే పేషెంట్లను గుర్తించి దాత సహకారంతో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి గొడుగులను పంపిణీ చేశారు. రెండు రోజుల నుంచి ఎడతెరపి లేని వర్షాలతో ఆసుపత్రికి అనేక మంది రోగులు వస్తున్నారు. గ్రంధి అమరేంద్ర సహకారంతో 30 గొడుగులను శుక్రవారం రెడ్‌క్రాస్ వద్ద పాదచారులకు కృష్ణారెడ్డి అందజేశారు. కెబి సీతారామ్, ఆర్ఎస్ఆర్‌కె వర ప్రసాదరావు, స్పందన, ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి : రోషన్



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్

లింగపాలెం, జూలై 19: ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. ధర్మాజిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. గత ఏడాది కేవలం నలుగురు విద్యార్థులు మాత్రమే ప్రవేశం పొందడం దారుణమని, ఆగస్టు 15 నాటికి కళాశాలలో కనీసం 30కి పైగా చేరాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడు తూ ఇప్పటికే 28 మంది చేరారన్నారు. ఇంకా ఎక్కువగా చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వెలగలపల్లి పాఠశాల తనిఖీ

● చింతలపూడి: మండలంలోని వెలగలపల్లి ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలకు సౌకర్యాలు కల్పిస్తామని హెచ్‌ఎం స్వరూపరాణికి హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల టీడీపీ నాయకులు ఎం.వెంకటరామయ్య, కోంద్రుదేవ, కె.రాజశేఖర్‌రెడ్డి, అట్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాగులపై వంతెనలు నిర్మించాలని ఆందోళన



వాగు వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు

బుట్టాయగూడెం, జులై 19: ఏజెన్సీ ప్రాంతంలో కొండవాగుల పై వంతెనలు నిర్మించాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో రెడ్డిగణపవరం జల్లేరు కొండవాగు వద్ద శుక్రవారం గిరిజనులు ఆందోళన చేశారు. జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ వర్షాలకు వాగులు పొంగడంతో ఏజెన్సీవాసులకు తిప్పలు తప్పడం లేదన్నారు. వర్షాకాలం ఏజెన్సీకి బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయని, అత్యవసర సమయాల్లో వైద్యసేవలు అందే పరిస్థితులు ఉండవన్నారు. రెడ్డిగణపవరం, వీరన్నపాలెం, విప్పలపాడు, పట్టెన్నపాలెం కొండవాగులపై వంతెనలు నిర్మించి ఏజెన్సీ వాసుల కష్టాలు తీర్చాలన్నారు. పట్టెన్నపాలెం జల్లేరు వాగుపై వంతెన నిర్మాణం చేపట్టి 15 ఏళ్లయినా నేటికి పూర్తికాలేదని తెలిపారు. కార్యక్రమంలో శివుడు భీముడు, సున్నం కృష్ణ, పాతపాటి సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

వైసీపీ నేత చేపల చెరువు సొమ్ము కాజేశారు



నిరసన తెలుపుతున్న సొసైటీ సభ్యులు

దెందులూరు, జూలై 19: వైసీపీ నేతలు చేపల చెరువు సొమ్ము రూ.20 లక్షలు దౌర్జన్యంగా తీసుకున్నారని సోమవరప్పాడు పంచాయతీ పరిధిలోని వీరభద్రపురం మత్స్యకార సొసైటీ సభ్యులు ఆరోపించారు. వైస్ ఎంపీపీ, వైసీపీ నేతపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సోమవరప్పాడులో 150 మంది సభ్యులు రహదారిపై జోరు వర్షంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో అందరూ కలసి చేపలను పెంచుకుని పట్టుకునేవిధంగా సోమవరప్పాడు గ్రామానికి చెందిన మాగంటి సురేంద్రనాథ్ చౌదరికి ఇచ్చామని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అడ్డగోలుగా ఆ పార్టీ నేత చేపలు పట్టుబడి చేయించి గ్రామస్తులతో పాటు సురేంద్రనాథ్ చౌదరికి నష్టం కలగజేశాడని ఆరోపించారు. వైసీపీ నేత నుంచి చేపల సొమ్ము రికవరీ చేయాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రెండు గంటల పాటు నిరసన తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.



ద్వారకాతిరుమల మండలంలో చేలో ఎర్రకాల్వ నీరు



భీమడోలు మండలంలో చేలను పరిశీలిస్తున్న అధికారులు



జంగారెడ్డిగూడెం మండలంలో మునిగిన చేలు



లింగపాలెం మండలంలో మునిగిన వరి నాట్లు

జలమయం

• నీట మునిగిన నారుమడులు • పల్లపు ప్రాంతాలను ముంచిన వర్షం • రహదారులు ధ్వంసం

ఏలూరు టూటౌన్, జూలై 19: జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో జనజీవనం స్తంభించింది. రెండో రోజు శుక్రవారం కూడా పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నగరం, విలీన గ్రామాల్లో రోడ్లపై వర్షపునీరు నిలిచిపోయింది. తంగెళ్ళమూడి, శనివారపుపేట, మాదేపల్లి, వెంకటాపురం, కొమడవోలులో దాదాపు అన్ని కాలనీలు నీట మునిగాయి. ఈ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై గుంతల్లో నీరు చేరి వాహన దారులు ఇబ్బందులుపడ్డారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక వర్షపునీరు రహదారి పైకి వచ్చేశాయి. నగరపాలక సంస్థ సిబ్బంది వర్షపునీటిని బయటకు పంపేందుకు ఎటువంటి ప్రయత్నాలు చేయకపోవడం గమనార్హం. యాదవ్‌నగర్ యూపీ స్కూల్‌లో భారీగా నీరు చేరింది. తమ్మిలేరు ఉప్పొంగడంతో ఆరు గేట్లు ఎత్తివేశారు. శనివారపు పేట కాజ్‌వే వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తమ్మిలేరుకు వరద పెరుగుతున్న దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఖాజావలి అధికారులను ఆదేశించారు. ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు చేర్చాలని అన్నారు. సాయినగర్, వైఎస్సార్ కాలనీ, ఎస్ఆర్.నగర్, కుమడవోలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రస్తుతం తమ్మిలేరులో ప్రమాదకరంగా నీటి ప్రవాహంలేదని ప్రజలు ఆందోళన చెందవద్దని అన్నారు. నగర పాలక సంస్థ కమీషనర్ వెంకటకృష్ణ, తహసీల్దార్ ముర్రే, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

● పెదపాడు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని పలు గ్రామాలు తడిసిముద్దయ్యాయి. రామిలేరు, బుడమేరు కాలువలు, పంటకాలువల ద్వారా కొత్తూరు, సత్యవోలు, కొణికి, ముప్పర్రు వంటి కొల్లేరు పరిసర గ్రామాల్లోకి వర్షపునీరు చేరుతోంది. ముంపు సమస్యను ఎదుర్కొనే గ్రామాలను తహసీల్దారు భావన్నారాయణ సిబ్బందితో కలసి పరిశీలించారు. ముంపు సమస్య ఏర్పడితే తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అధిక వర్షాల దృష్ట్యా నారుమడులలో చేరిన నీటిని తొలగించాలని, నారుమడుల సంరక్షణకు మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్‌కుమార్ రైతులకు సూచనలు ఇచ్చారు.

● కామవరపుకోట: భారీ వర్షాలతో మండలంలో వరి చేలు చెరువులుగా దర్శనమిస్తున్నాయి. సుమారు 121 ఎకరాల్లో వరి మునిగినట్టు ఏవో సి.పవన కుమార్ ప్రాథమిక అంచనా వేశారు. ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.

● పోలవరం: మండల కేంద్రంలో గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలను ఎంపీడీవో జి.శ్రీను పరిశీలించారు. పోలవరం పంచాయతీ పరిధిలో గతంలో వరదల సీజనులో నెక్లెస్ బండ్‌కు పలుచోట్ల సీపేజీ వచ్చి ఇబ్బందులు ఎదురైన ప్రాంతాలైన యడ్లగూడెం, కమ్మరగూడెం, ఆంజనేయస్వామి ఆలయం రేవు, బిక్కుబాబా ఆలయం రేవు, గ్లోరియా బెలిని హాస్పటల్ రేవుల ప్రాంతాలను పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.

● ఉంగుటూరు: మండలంలో భారీ వర్షాలకు వివిధ ప్రాంతాలు, వరి చేలు నీట మునిగాయి. ఏవో వెంకటేశ్, సిబ్బంది ఆయా ప్రాంతాలను పరిశీలించారు. మండలంలోని 1704 ఎకరాల్లో నాట్లు, 320 ఎకరాల్లో నారు నీట మునిగినట్టు తెలిపారు. ఉంగుటూరు, కైకరం, బాదంపూడి, వెల్లమిల్లి, రెవెన్యూ గ్రామాలలో ముంపు ప్రాంతాలు ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

● ఏలూరు రూరల్: భారీ వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో మాదేపల్లి, మల్కాపురం, చాటపర్రు పరిసర ప్రాంతాల్లో అడుగు లోతు నీరు నిలిచిపోయింది. వర్షపునీరు తగ్గే అవకాశం లేకపోవడంతో వరి దెబ్బతింటుందని ఆందోళన చెందుతున్నారు. సీజన్ ప్రారంభమై 20రోజులు గడిచింది. మునిగి చేలల్లో తిరిగి నాట్లు వేయాలంటే మరో నెల సమయం పడుతుంది.

● జంగారెడ్డిగూడెం: భారీ వర్షాలకు మండలంలో 2,300 ఎకరాల్లో వరి నీట మునిగిందని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా శుక్రవారం తెలిపారు. మండలంలోని పుట్లగట్లగూడెం గ్రామంలోని నీట మునిగిన చేలను హబీబ్ బాషా పరిశీలించారు. ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు కోటరామచంద్రాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పీడీ బుజ్జిబాబు, మండల వ్యవసాయాధికారి కెవిఎస్.పోసారావు ఉన్నారు.

● భీమడోలు: మండలంలో పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మెట్ట ప్రాంత చెరువులు పూర్తిగా నిండిపోవడంతో చెరువులు పొంగి పొర్లి డ్రైనేజీలు నిండాయి. భీమడోలు జంక్షన్ వర్షపు నీటితో ముంపునకు గురైంది. వర్షాలకు భీమడోలులోని లింగంపాడు, గుండుగొలను శివారు ప్రాంతాల్లో వరిసాగు నీట మునిగింది. రోడ్లు జలమయం అయ్యాయి. మండలంలో నీట మునిగిన వరి చేలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. సూరప్పగూడెం, భీమడోలు గ్రామాల్లో చేలను డాట్ సెంటర్ సైంటిస్టు ఫణికుమార్, నాగబాబు, ఎఫ్‌టీసీ ఏరియా సుధారాణి, ఏడీఏ ఉషారాజకుమారి, ఏవో ఉషారాణి పరిశీలించారు. నారుమడి, నాట్లు సంరక్షణకు సూచనలు ఇచ్చారు.

● జీలుగుమిల్లి: వర్షాలకు పలు చోట్ల రహదారులు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కల్గుతున్నాయి. జీలుగుమిల్లి నుంచి తాటియాకులగూడెం రహదారిపై పలు చోట్ల రోడ్డు పాడైంది. రహదారిపై పెద్ద పెద్దగోతులు ఏర్పడడంతో చీకట్లో వాహనం గోతిలో దిగితే బయటకు రావడం కష్టంగా మారింది. ములగలంపల్లి, నిర్వాసిత కాలనీ కొరుటూరు వెళ్లే రహదారి, వంకవారిగూడెం, దర్భగూడెం, స్వర్ణవారిగూడెం, రాచన్నగూడెం, బొత్తప్పగూడెం గ్రామాల వద్ద వరద నీటికి రహదారులు కోతకు గుర య్యాయి. కనీస మరమ్మతు పనులు చేస్తే గాని వాహనాలు తిరిగే పరిస్థితి లేదు. పలు చోట్ల రహదారులు కల్వర్టులు దెబ్బతినడంతో ప్రజలను అప్రమత్తం చేసేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. రౌతుగూడెం బ్రిడ్జి వద్ద పడిన భారీ వృక్షం తొలగించే పనులను సీఐ క్రాంతికుమార్ పర్యవేక్షించారు. బ్రిడ్జి వద్ద చేపల వేటకు వచ్చిన వారిని అప్రమత్తం చేశారు.

● లింగపాలెం: వర్షాలకు నీట మునిగిన చేలను ఏవో కోటగిరి మురళీకృష్ణ పరిశీలించారు. నారుమడి దశలో నేరుగా విత్తనాలు విత్తిన పొలాలు మొలకదశ నుంచి మొక్కదశలో ఉన్నాయని, అవి వర్షాలకు నీట మునిగి పాడైపోయే స్థితిలో ఉన్నాయన్నారు. నీటమునిగిన పంటపొలాల్లో నీరు నిలవకుండా చూసుకోవాల న్నారు. రైతులకు పంట పొలాలపై పలు సూచనలు చేశారు.

● నిడమర్రు: ఎడతెరిపి లేని వర్షాలకు మండలంలో వరి చేలు నీట మునిగాయి. ఛానమిల్లి, అడవికొలను, భువనపల్లి, క్రొవ్విడి, బావాయిపాలెం గ్రామాలలో నారుమడులు నీట మునగడంతో కుళ్లిపోయే పరిస్థితి నెలకొంది. వ్యవసాయ శాఖ సిబ్బంది పలు గ్రామాలలో పర్యటించి పరిస్థితిని అంచనా వేస్తున్నారు. చేల నుంచి మురుగునీరు పోయే మార్గాలను అన్వేషించి కార్యాచరణ చేపడుతున్నారు. ఏవో ఎస్.గీతాదేవి మాట్లాడుతూ సుమారు 350 ఎకరాలలో వరినారు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉందని వర్షాలు తగ్గిన వెంటనే రైతులు చేలల్లో నీరు పోయే టట్లు చర్యలు తీసుకోవాలన్నారు. జ్యోతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: మండలంలో భారీ వర్షాలకు వాగుల ఉధృతి కొనసాగుతోంది. మక్కినవారిగూడెం సమీపంలో దుర్గగుడి వద్ద జలవాగు, బండివాగూడెం - గంగినీడుపాలెం, ముగ్గురాళ్ళ వాగు, పాకలగూడెం వద్ద గల మేకల వాగు, మధ్యాహ్నపు వారిగూడెం - అప్పలరాజుగూడెం గ్రామాల మధ్య ఎర్రకాలువ పొంగి ప్రవహిస్తున్నాయి. కాలువల వద్ద ఇరువైపులా రోడ్డుపై పోలీసులు గస్తీ ఏర్పాటు చేశారు. మక్కినవారిగూడెం, గంగినీడుపాలెం, నాయకులుగూడెం, సీతంపేట తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

● ద్వార కాతిరుమల: మండలంలో దాదాపు 650 ఎకరాల్లో వరి చేలు నీటమునిగాయి. ఎర్రకాలువ కుడి ప్రధాన కాల్వ పొంగి ఐఎస్ జగన్నాథపురం, ఐఎస్ రాఘవాపురంలో 300 ఎకరాల్లో వరిచేలు నీట మునిగాయి. జి.కొత్తపల్లి, రామసింగవరం, లక్ష్మీపురం వంటి ఇతర గ్రామాల్లో సైతం మరో 350 వరకు ఎకరాల్లో వరి నీట మునిగినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

వృద్ధాశ్రమాన్ని పరిశీలించిన అధికారులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీ సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమాన్ని తహసీల్దారు కె.స్లీవ జోజి, మున్సిపల్ కమిషనర్ జె.నరేంద్రకుమార్, ఎస్సై జ్యోతిబసు శుక్రవారం సందర్శించారు. భారీ వర్షం కారణంగా ఆశ్రమంలోకి వరద నీరు చేరడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ వెట్రిసెల్వి వృద్ధుల పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఆశ్రమంలో పరిస్థితులను కలెక్టర్‌కు నివేదిస్తామని తహసీల్దారు తెలిపారు.



పోలవరంలో చెరువును తలపిస్తున్న చేలు



ఉంగుటూరు మండలంలో పూర్తిగా మునిగిన వరి నాట్లు



టి.నరసాపురం మండలంలో ముగ్గురాళ్ల వాగు ఉధృతి



పి.అంకంపాలెం-కొరుటూరు మధ్య కొట్టుకుపోయిన రోడ్డు



ఏలూరు నగరం కాలనీల్లో దెబ్బతిన్న రహదారి



కొయ్యలగూడెం మండలం రాజవరం వద్ద మునిగిన చేలు



జంగారెడ్డిగూడెంలో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ఏలూరు సిటీ / జంగారెడ్డిగూడెం, జూలై 19: జిల్లాలో వరద ప్రమాదం ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె వెట్రిసెల్వి ఆదేశించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వరద ప్రభావిత గ్రామాల్లో ఎస్పీ, ఐటీడీఏ పీవో, అధికారులతో కలసి పరిశీలించారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో అధికారులతో సమీక్షించారు. దెబ్బతిన్న రహదారులను యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితికి అవసరమైన బోట్లు, లైఫ్ జాకెట్లు, గత ఈతగాళ్ళను సిద్ధంగా ఉంచాలన్నారు. వరద తీవ్రత ఉన్న ప్రతీ గ్రామంలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, పోలీస్ సిబ్బందిని బృందంగా ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలకు వాటర్ ట్యాంకర్లను పంపాలని ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. దెబ్బతిన్న ఇళ్లు, పంట, తదితర నష్టాలపై అధికారులు నివేదికలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా స్థాయిలో 24 గంటలు పనిచేసే కమాండ్ కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నెంబరు 1800-233-1077తో ఏర్పాటు చేశామన్నారు. ఎస్పీ కిశోర్ మాట్లాడుతూ విపత్తు నిర్వహణపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించేందుకు పటిష్ఠ సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సిబ్బంది వేగమైన స్పందనతో విపత్తు నిర్వహణ విధులు నిర్వర్తించాలన్నారు. జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ గ్రామ స్థాయి బృందాలు సమన్వయంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు



ఫాగింగ్ చేస్తున్న నగరపాలక సిబ్బంది

ఏలూరు టూటౌన్, జూలై 19: వర్షాకాలం సీజనల్ వ్యాధులు రాకుండా తగు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ హెల్త్ అధికారి రెడ్డి మాలతి తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చోడిదిబ్బ, రెహ్మత్‌నగర్, చిన్నరామాలయం, పెద్దరామాలయం, తంగెళ్ళమూడి, తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేశారు. ఖాళీ స్థలాల్లో నీటిలో ఆయిల్‌బాల్స్ వేశారు. కార్యక్రమంలో జే.సంతోషిప్రసాద్, మలేరియా ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలస్వామి, సూపర్‌వైజర్ దుర్గారవు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, విశ్వేశ్వరారవు, ఆరోగ్య కార్యదర్శులు ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి

లింగపాలెం, జూలై 19: సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని జిల్లా మలేరియా అధికారి ప్రసాద్ అన్నారు. ధర్మాజిగూడెం పీహెచ్‌సీ సందర్శించిన ఆయన శుక్రవారం సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో శానిటేషన్, ఫాగింగ్ లాంటివి చూడాలని అన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఆరోగ్యసిబ్బందికి అవగాహన కల్పించారు. గ్రామ కార్యదర్శులు, ఏఎన్ఎమ్‌లు, ఆశాలు ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటించాలని, ప్రతి ఇంటిని తనిఖీచేసి ప్రజలకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు.

నీట మునిగిన వరి.. సంరక్షణ సూచనలు

పెదవేగి, జూలై 19: భారీవర్షాల నీట మునిగిన వరి సంరక్షణకు ఏరువాక కేంద్రం జిల్లా సమన్వయకర్త కె.ఫణికుమార్ పలు సూచనలు ఇచ్చారు. జూన్‌లో విత్తిన పంట పిలక దశ, జూలైలో విత్తిన పంట నారుమడి దశ, నేరుగా విత్తిన పంట మొలక దశలో ఉన్నాయని చెప్పారు. విత్తనం చల్లిన రెండు, మూడు రోజుల కంటే ఎక్కువగా నీట మునిగితే మొలకశాతం తగ్గుతుందని, వీలైనంత త్వరగా నీరు బయటకు తీసేయాలన్నారు. విత్తిన ఏడు నుంచి నెలరోజుల వ్యవధి వరి పంట ఐదు రోజులకంటే ఎక్కువగా మునిగి ఉంటే దెబ్బతింటుందన్నారు. నారుమడిలో నీరు తీసిన తరువాత ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్ వేయాలని, లీటరు నీటిలో ఒక గ్రాము కార్బండిజమ్, మాంకోజెబ్ పిచికారీ చేయాలని ఆయన సూచించారు. రైతులు సకాలంలో యాజమాన్య పద్ధతులను చేపట్టకపోతే పంటనష్టపోయే ప్రమాదం ఉందని ఫణికుమార్ తెలిపారు.

పట్టణంలో పారిశుధ్యం మెరుగు పరచాలి



సమస్యలపై మాట్లాడుతున్న కౌన్సిలర్

జంగారెడ్డిగూడెం, జూలై 19: పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచాలని మున్సిపల్ కౌన్సిలర్లు కోరారు. మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. పలువురు కౌన్సిలర్లు పట్టణ సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. కౌన్సిలర్ వలవల తాతాజీ మాట్లాడుతూ ఇందిరా నగర్ కాలనీలో దోమలు, కుక్కలు, పందుల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ముప్పిడి అంజి, నంబూరి రామచంద్రరాజు, కె.రమాదేవి, గీతాకుమారి, నేట్రు సుబ్బలక్ష్మి ఆయా వార్డులలో పారిశుధ్యం మెరుగుపరచాలని కోరారు. కౌన్సిలర్ చిటికెల అచ్యుత రామయ్య మాట్లాడుతూ ఇసుక సరఫరా లేక పట్టణంలో పెండింగ్ పనులు పూర్తి చేయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ కార్యాలయ మేనేజర్ వెంకటరమణ, ఏఈ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

లోకో పైలెట్ విశ్రాంతి గది ప్రారంభించిన డీఆర్ఎం

ఏలూరు క్రైం, జూలై 19: ఏలూరు రైల్వే స్టేషన్‌లో లోకో పైలెట్లు విశ్రాంతి తీసుకునేందుకు నిర్మించిన గదిని విజయవాడ రైల్వే డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఆనందరావు పాటిల్ శుక్రవారం ప్రారంభించారు. రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనుల్లో భాగంగా విశ్రాంతి గది నిర్మించారు. డివిజినల్ ఆపరేషన్ మేనేజర్ సత్యస్వరూప్, స్టేషన్ మేనేజర్ ఎన్‌వి.రమేష్, ఏఈ ఎన్.సతీష్ కుమార్, ఐవోడబ్ల్యుఎస్ఎస్ వర్క్స్ శంకరరావు, రైల్వే ఎస్ఐ సైమన్, పలువురు పాల్గొన్నారు. ఇటీవల ఏడాదిపైగా ఏలూరు మీదుగా వెళ్ళే పలు రైళ్ళను రద్దు చేస్తున్నారని, వాటిని త్వరితగతిన పునఃప్రారంభించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు. ఆధునీకరణ పనులు పూర్తయిన తరువాత దశలవారీగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

పాండురంగస్వామి శాంతి కల్యాణం

ఏలూరు కార్పొరేషన్, జూలై 19: పాతబస్టాండ్ సెంటర్ పాండురంగ స్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా రుక్మాబాయి సమేత పాండురంగస్వామి శాంతి కల్యాణం శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఎమ్మెల్యే బడేటి చంటి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

అన్న క్యాంటీన్ పనులకు నేడు ఎమ్మెల్యే శంకుస్థాపన

జంగారెడ్డిగూడెం, జూలై 19: మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో అన్న క్యాంటీన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ శనివారం శంకుస్థాపన చేయనున్నట్లు కమిషనర్ జె.నరేంద్రకుమార్ తెలిపారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారు.

ఏలూరు రైల్వే ఎస్ఐగా సైమన్

ఏలూరు క్రైం, జూలై 19 : ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పీతల సైమన్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. 1987 పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా చేరిన ఆయన అనేక పోలీస్ స్టేషన్లలో కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేశారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేశారు. ఇటీవల ఆయనకు ఎస్ఐగా పదోన్నతి కల్పించి ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నియమించారు. ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టడంతో పలువురు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఏలూరు కార్పొరేషన్, జూలై 19: భారీ వర్షాలతో పంట నీట మునిగి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. అన్నేభవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజులుగా భారీ వర్షాలు కురియడంతో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. అధికారులు తక్షణమే నష్టాలను అంచనా వేసి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** బావిశెట్టివారిపేట రామానగర్ కాలనీ షిరిడీ సాయి ధ్యాన మందిర్ వద్ద ఈనెల 21 వరకు జరగనున్న గురుపౌర్ణమి మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. బాబా వారి పల్లకీ ఉత్సవాన్ని భక్తులతో నిర్వహించారు.
- అంబికాదేవి ఆలయంలో శుక్రవారం రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చనను మహిళలు నిర్వహించారు. మూలా నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేశారు.
- ఆదివారపుపేట సాయిబాబా ప్రేమమందిరం వద్ద భక్తులకు ఆలయ అధ్యక్షులు ఇసుకపల్లి తాతారావు దుస్తులను పంపిణీ చేశారు. ఈనెల 21న గురుపౌర్ణమి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు.
- **కామవరపుకోట :** మండలంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, కార్యకర్తలు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఎర్రకాలువ ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని కోరారు.
- **పెదపాడు :** ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులకు సోషల్ ఆడిట్ గ్రామసభలు తోటగూడెం, నాయుడుగూడెం గ్రామాల్లో శుక్రవారం జరిగాయి. చేపట్టిన పనులు, నగదు చెల్లింపులు సిబ్బంది తనిఖీ చేశారు.
- **భీమడోలు :** జనసైనికులు, పార్టీ కార్యకర్తలు ఈనెల 28వ వరకూ సభ్యత్వాల నమోదులో పాల్గొనాలని ప్రత్తి మదన్ సూచించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు.
- **ఉంగుటూరు :** మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీల వంద రోజుల ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి,అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.
- **లింగపాలెం :** మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 8 ఏళ్ల బాలుడు పొదిల ధనుష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఏలూరులోని ఆశ్రమం ఆసుపత్రి వైద్య సిబ్బందితో మాట్లాడి, ధనుష్‌కు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కోరారు.
- **చింతలపూడి :** పట్టణంలో దోమల నివారణకు డ్రైనేజిల్లో మురుగునీరు తొలగించడానికి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు ఆర్‌వి సత్యనారాయణ, ఎస్.సూర్యకుమార్ విజ్ఞప్తి చేశారు. డ్రైనేజిల్లో పూడిక తీయకపోవడం వల్ల నీరుపోయే దారిలేక ఇళ్ళచుట్టూ చేరుతున్నాయన్నారు. జ్వరాలు, కీళ్ళనొప్పులతో ప్రజలు ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని, పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు.



బలివే వద్ద తమ్మిలేరు వరద ఉధృతి



ఊటుకూరులో నీటమునిగిన వెదజల్లిన వరి పొలం



చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వే వద్ద వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్

భయం.. భయంగా

- తమ్మిలేరుకు కొనసాగుతున్న వరద ఉధృతి
- ఉప్పుటేరులో చేపల వేటకు వెళ్లవద్దన్న అధికారులు
- వర్షాలకు కూలిన ఇల్లు... నీట మునిగిన పొలాలు

ముసునూరు, జూలై 19: మండల వ్యాప్తంగా ఉన్న తమ్మిలేరులో శుక్రవారం ఉదయం నుంచి వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. అల్పపీడనం ప్రభావంతో ఎగువన కురుస్తున్న వర్షాలతోపాటు, తమ్మిలేరు ప్రాజెక్ట్ నుంచి దిగువకు నీరు విడుదల చేయడంతో తమ్మిలేరులో వరద గంట గంటకు పెరుగుతోంది. దీంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. తమ్మిలేరు పరీవాహక గ్రామాలైన లోపూడి, గుళ్ళపూడి, గుడిపాడు, వలసపల్లి, యల్లాపురం, వెంకటాపురం, బలివే, రంగంపేట తదితర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. తమ్మిలేరులో వరద ఉధృతి పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో చేపలు వేటకు, ఈతకు వెళ్ళవద్దని అధికారులు సూచించారు. ఎప్పటికప్పుడూ వరద పరిస్థితిని పరిశీలించాలని గ్రామస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తహసీల్దార్ జవహర్ బాజి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు.

తమ్మిలేరును దాటవద్దు..

చాట్రాయి: చాట్రాయి మండలం పక్కనే ఉన్న తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మహ్మద్ ముక్బూద్ అలీ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన చిన్నంపేట కాజ్‌వే వద్ద తమ్మిలేరు వరదను పరిశీలించారు. ఎవరూ తమ్మిలేరును దాటే ప్రయత్నం చేయవద్దని, పశువులను కూడా వరద వైపు వెళ్ళనివ్వవద్దని సూచించారు. అత్యవసరం సహాయం కోసం అధికారులకు ఫోన్ చెయ్యాలని కోరారు.

కలిదిండి: భారీ వర్షాల దృష్ట్యా ఉప్పుటేరు తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ దశిక వంశీ అన్నారు. శుక్రవారం మద్యాని గూడెం వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఉప్పుటేరును పరిశీలించి మాట్లాడుతూ ఉప్పుటేరులోకి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. మట్టగుంట, పెదలంక పల్లిపాలెంలో బోటు ప్రయాణం నిలుపుదల చేశామన్నారు. ఉప్పుటేరు తీర గ్రామాల్లో వీఆర్వోలు, కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

పొలాల్లో కదలని నీరు..

ముదినేపల్లి: వర్షాలకు డ్రైన్లు పొంగుతుండటంతో వెదజల్లిన వరి పొలాల్లో వర్షపు నీరు కదలటం లేదు. ముదినేపల్లి ప్రాంతంలో సుమారు 13 వేల ఎకరాల ఆయకట్టులో సార్వా వరి వెదజల్లగా, మరో 4 వేల ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉంది. వెదజల్లిన ఆయకట్టులోని వందలాది ఎకరాలు ముంపు బారిన పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే సుమారు 1000 ఎకరాల్లో వర్షపు నీరు బయటికి పోయే మార్గం లేకుండా పోయింది. డ్రెయిన్లలో గుర్రపు డెక్క, కిక్కిస పేరుకుపోవటంతో నీటి ప్రవాహం వేగం అందుకోవటం లేదు. మైనర్ డ్రెయిన్లలో నీరు స్తంభించిపోవటంతో పొలాల్లో ముంపు తగ్గటం లేదు. చినపాలపర్రు, ఊటుకూరు, చిగురుకోట తదితర గ్రామాల్లో వెదజల్లిన పొలాల్లో ముంపు పెరుగుతున్నది. డ్రెయిన్ల కింది భాగంలోని గుర్రపు డెక్క, కిక్కిస తొలగింపు పనులు చేపట్టకపోతే మరింత ముంపు పెరిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సోమవరంలో కూలిన ఇల్లు



చాట్రాయి: వర్షానికి సోమవరం గ్రామంలో శుక్రవారం రాజులపాటి సరస్వతి అనే వృద్ధురాలి పెంకుటిల్లు కూలిపోయింది. ఆమె ఇంటి బయట పనిచేసుకుంటుండగా ఇల్లు కూలటంతో ప్రాణాపాయం తప్పింది. వీఆర్వో ఆంజనేయ ప్రసాద్ కూలిన ఇంటిని పరిశీలించి, తహసీల్దార్ మహ్మద్ ముక్బూద్ అలీకి నివేదిక అందజేశారు.

415 మిల్లీమీటర్ల వర్షపాతం

నూజివీడు టౌన్, జూలై 19: అల్పపీడన ప్రభావంతో నూజివీడు డివిజన్ వ్యాప్తంగా డివిజన్ వ్యాప్తం 415.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చింతలపూడిలో అత్యధికంగా 117.2, అత్యల్పంగా ఆగిరిపల్లి మండలంలో 28.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లింగపాలెంలో 101.4, చాట్రాయిలో 57.8, ముసునూరులో 48.0, నూజివీడులో 64.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా నూజివీడు డివిజన్‌లో సరాసరి వర్షపాతం 69.2 మి.మీటర్లు నమోదయ్యింది.

నేడు పాఠశాలలకు సెలవు

చాట్రాయి, జూలై 19: భారీ వర్షాలు కురుస్తున్నందున విద్యార్థుల భద్రత దృష్ట్యా జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వుల మేరకు 20వ తేదీ శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు ఎంఈవో బ్రహ్మాచారి తెలిపారు. అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అమలు చేయాలని కోరారు.

ముదినేపల్లి: భారీ వర్షాల కారణంగా జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ముదినేపల్లి మండలంలోని పాఠశాలలను శుక్రవారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున ఒక్కపూట మాత్రమే పాఠశాలలను నిర్వహించారు. మధ్యాహ్నం భోజనం అనంతరం పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నియామకం

ఆగిరిపల్లి, జూలై 19: ఆగిరిపల్లి మండలానికి నూతనంగా ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈని నియమించినట్లు ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు. బదిలీల్లో భాగంగా రెంటాల పవన్‌కుమార్‌ను ఆగిరిపల్లి మండల నూతన ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈగా నియమించారని ఈయన బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు.

బియ్యం విక్రయ కేంద్రం ప్రారంభం

చాట్రాయి, జూలై 19: జిల్లా పౌర సరఫరాల అధికారి ఆదేశాల మేరకు, చాట్రాయిలో కిరాణా మర్చంట్స్ అసోసియేషన్‌లో శుక్రవారం బియ్యం, కంది పప్పు విక్రయ ప్రత్యేక కౌంటర్‌ను తహసీల్దార్ మహ్మద్ మక్బూద్ అలీ ప్రారంభించారు. దేశవాళీ కందిపప్పు 1 కిలో రూ 160కి, బియ్యం స్టీమ్ బీపీటీ, సోనా మసూరి 1 కిలో రూ. 49, పచ్చి బీపీటీ సోనామసూరి 1కిలో రూ. 48 కి విక్రయిస్తారని, ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు.

నేడు మండల పరిషత్ సమావేశాలకు మంత్రి

చాట్రాయి, జూలై 19: చాట్రాయి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం 1 గంటకు జరుగుతుందని, సమావేశానికి మంత్రి కొలుసు పార్థసారథి హాజరవుతున్నారని ఎంపీడీవో మంగాకుమారి తెలిపారు. వ్యవసాయం, గృహ నిర్మాణం, వైద్యం, విద్య, విద్యుత్, తాగునీరు, పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమం మొదలైన అంశాలపై చర్చ జరుగుతుందని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

ముసునూరు: ముసునూరు మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ కొండా దుర్గాభవాని అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సీహెచ్.పద్మావతిదేవి తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి కొలుసు పార్థసారథి విచ్చేస్తున్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా సమావేశాని హాజరుకావాలని ఎంపిడివో కోరారు.

మంత్రి చొరవతో సురక్షితంగా స్వగ్రామానికి..



నూజివీడు, జూలై 19: ఆలయ సందర్శనకు వెళ్ళి గురువారం రాత్రి వరదలో చిక్కుకున్న నూజివీడు మండలం దేవరగుంట గ్రామానికి చెందిన భక్తులు మంత్రి సారథి చొరవతో సురక్షితంగా గమ్యం చేరుకున్నారు. దేవరగుంటకు చెందిన 65 మంది బృందంగా ఓ ప్రైవేట్ వాహనంలో గురువారం ఉదయం గుబ్బల మంగమ్మ ఆలయానికి వెళ్ళారు. వారు ఆలయం వద్ద ఉండగానే భారీ వర్షాలకు ఒక్కసారిగా వరద ముంచెత్తడంతో అక్కడే చిక్కుకుపోయారు. రాత్రి 9.30 గంటలు అయినా వరద తగ్గకపోవడంతో వంకాయల హరిబాబు అనే వ్యక్తి మంత్రి పార్థసారథికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. స్పందించిన మంత్రి ఆర్టీసీ డిపో మేనేజర్‌ను అప్రమత్తం చేసి ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి వారిని తీసుకు రావాలని ఆదేశించారు. నూజివీడు డిపో మేనేజరు పవన్‌కుమార్ ఒక ప్రత్యేక బస్సును ఏర్పాటుచేసి వరదలో చిక్కుకున్న భక్తులను తిరిగి దేవరగుంట గ్రామానికి చేర్చారు. తమను కాపాడిన మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

ముదినేపల్లి, జూలై 19 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ముదినేపల్లి మండలంలో ప్రత్యేక విచారణ జరపనున్న నేపథ్యంలో చిగురుకోట ఫీల్డ్ అసిస్టెంట్ యోహాన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు డ్వామా పీడీ రాము ఉత్తర్వులు జారీ చేశారని ఏపీవో నాగరాజు తెలిపారు. గ్రామంలో 2023-24 సంవత్సరంలో రూ.60 లక్షల వ్యయమయ్యే పనులు నిర్వహించగా, వాటిపై ఇటీవల మండల స్థాయిలో జరిగిన ప్రజా వేదికలో పలు ఆరోపణలు వచ్చాయి. దీంతో డ్వామా పీడీ పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారు. త్వరలో ప్రత్యేక కమిటీ విచారణ చేపట్టనుండగా, ప్రాథమికంగా కొన్ని అవకతవకలు గుర్తించారు. 2018లో మరణించిన వారు కూడా పనులకు వస్తున్నట్లు మస్టర్ వేయటాన్ని గుర్తించిన అధికారులు విచారణకు ముందే ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశారు.

విద్యుదాఘాతానికి కౌలు రైతు బలి



మురళీకృష్ణ (ఫైల్)

చాట్రాయి, జూలై 19: మండలంలోని కోటపాడులో శుక్రవారం విద్యుదాఘాతంతో కౌలు రైతు జుజ్జువరపు మురళీకృష్ణ (37) మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం స్థానికంగా ఓ రైతు వ్యవసాయ భూమిని మురళీకృష్ణ కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. శుక్రవారం వర్షం కురుస్తుండటంతో మోటార్ ఆపటానికి మురళీకృష్ణ స్టార్టర్ ముట్టుకోవటంతో దానికి కరెంట్ పాస్ కావడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్సై గజపతిరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టంకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు మంచిన పూర్ణచంద్రరావు మాట్లాడుతూ టీడీపీ కార్యకర్త అయిన మురళీకృష్ణ కుటుంబానికి పార్టీ నుంచి సహాయం అందేలా కృషి చేస్తామని చెప్పారు. కోటపాడులో విషాద ఛాయలు అలుముకున్నాయి.

వీడని ఎంపీడీవో అదృశ్యం మిస్టరీ

- కొనసాగుతున్న గాలింపు



ఎంపీడీవో కార్యాలయంలో విచారణ చేస్తున్న సీఐ బాషా

నరసాపురం రూరల్, జూలై 19: నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ అదృశ్యం ఇంకా మిస్టరీగానే మిగిలింది. శుక్రవారం సాయంత్రం వరకు ఆయన ఆచూకీ చిక్కలేదు. విజయవాడ పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి లోతైన విచారణ చేపట్టారు. మరో వైపు ఈకేసు మిస్టరీగా మారింది. ఎంపీడీవోకు ఫోన్ చేసి బెదిరించి అకౌంట్‌లోకి లక్షలాది రూపాయలు బదిలీ చేయించుకున్నది ఎవరనేది సస్పెన్స్‌గా మారింది. ప్రస్తుతం దీనిపైనే ఉద్యోగ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఇటు పోలీసులు కూడా ఈ చిక్కుముడిని ఛేదించేందుకు కాల్‌డేటా ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

కృష్ణా జిల్లా పోలీసుల విచారణ

మరోవైపు కృష్ణా జిల్లా పోలీసులు విచారణ నిమిత్తం నరసాపురం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా ఆధ్వర్యంలో విచారణ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో రేవుకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. వివరాలను ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు, ఎంపీపీ సోని, సిబ్బంది నుంచి ఆరా తీశారు. ఆయనకు ఫోన్‌లు ఎక్కడ నుంచి వచ్చేవి, ఆర్థిక పరిస్థితి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాకీ ఎప్పటి నుంచి కట్టాల్సి ఉంది, దానికి సంబంధించి పాటదారుడికి ఎంపీడీవో వెంకటరమణ ఇచ్చిన నోటీసులను పరిశీలించారు. విచారణలో స్థానిక సీఐ స్వామి పాల్గొన్నారు.

ఈ కేసును రాజకీయం చేస్తున్నారు..

అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాలని వైసీపీ నాయకుల డిమాండ్

ఎంపీడీవో అదృశ్యంపై తమ పార్టీ నేతలపై వస్తున్న ఆరోపణలపై వైసీపీ నాయకులు శుక్రవారం స్పందించారు. పార్టీ కార్యాలయంలో జడ్పీటీసీ రాధాకృష్ణ, ఎంపీపీ సోని, సీనియర్ నాయకులు వైఎస్, కామన బుజ్జి, షేక్ బుల్లిమస్తాన్ విలేకర్లతో మాట్లాడారు. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే ముదునూరిని ఇరికించేందుకు టీడీపీ, జనసేన పార్టీలు కుట్ర చేస్తున్నాయన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత ఎంపీడీవో వెంకటరమణ బాధ్యతలు చేపట్టారన్నారు. ఈ కారణంగా ఒక్కసారి కూడా రేవుకు సంబంధించిన బకాయిల కోసం ఫోన్ చేయలేదని.. అవసరమైతే ముదునూరి కాల్ డేటాను పరిశీలించుకోవచ్చన్నారు. ఈ కేసును అన్ని కోణాల్లో విచారించాలని డిమాండ్ చేశారు. పాటదారుడు దవేజీ త్వరలో ఈ సొమ్మును చెల్లిస్తారని, అతడి పంటు ప్రభుత్వ ఆధీనంలోనే ఉంద న్నారు. నిజాయతీపరుడైన ఎంపీడీవో క్షేమంగా తిరిగి రావాలని కోరుకుంటున్నా మన్నారు. సమావేశంలో పీడీ రాజు, జయ, మురళీ, శంకర్ తదితరలుఉ పాల్గొన్నారు.



మంత్రి పార్థసారథికి వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి : మంత్రి సారథి

నూజివీడు టౌన్, జూలై 19: రెండ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి కొలుసు పార్థసారథి సూచించారు. నూజివీడు నియోజకవర్గంలో భారీ వర్షాల కారణంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే సంబంధింత మండల శాఖ అధికారులను, నూజివీడు క్యాంప్ ఆఫీసు కార్యదర్శిని సంప్రదిం చవచ్చన్నారు. కలుషిత నీటితో అతిసారం ప్రబలే ప్రమాదం ఉందని, విద్యుత్ స్తంభాలు పడిపోతే విద్యుత్‌కు అంతరాయం కలగవచ్చన్నారు. నియోజకవర్గంలో అధికారు లతో పాటు క్యాంప్ కార్యాలయంలో అందరూ అందుబాటులో ఉంటారన్నారు. సమస్య వస్తే 85220 07645, 90526 44606 నంబర్లకు సమాచారం ఇవ్వవచ్చన్నారు.

రహదారులు అభివృద్ధి చేయాలని వినతి

నూజివీడు మున్సిపల్ పరిధిలో స్వాతంత్ర్య కాలం నాటి రహదారుల వల్ల ట్రాఫిక్ సమస్యతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నూజి వీడు మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు మంత్రి పార్థసారథికి వినతిపత్రం ఇచ్చారు. ఇరుకు రహదారులతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుండగా ఐదేళ్లుగా రహదారులకు మరమ్మతులు కూడా చేపట్టలేదన్నారు. ఫలితంగా పట్టణ వాసులు ఇబ్బందులు పడుతున్నారని, రహదారులను విస్తరించి అభివృద్ధి పనులు చేపట్టవలసిందిగా వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. దాసరి స్వామి యాదవ్, కందిపల్లి చెన్నారావు, పాదం సత్యనారాయణ, కొణిదల కృష్ణకుమారి, పల్లె నాగరాజు, మందా శ్రీను పాల్గొన్నారు.





కైకలూరు వెలంపేటలో.. కలిదిండి లోని చినతాడినాడలో దుర్గమ్మలకు శాకంబరి అలంకరణ

శాకంబరిగా దుర్గమ్మ

కైకలూరు జూలై 19 : కైకలూరు వెలంపేటలోని దుర్గమ్మ శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం అమ్మవారిని కూరగాయలు, పండ్లతో అలంకరించారు. ఆషాడమాసం సందర్భంగా అమ్మవారిని శాకంబరిగా అలంకరించి పూజలు జరిపినట్లు ఆలయ అర్చకుడు నాగేశ్వరరావు తెలిపారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె

కలిదిండి: కోరుకొల్లులో శుక్రవారం రాజరాజేశ్వరి అమ్మవారికి మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. మేళతాళాలతో ఊరేగింపుగా బోనాలతో ఆలయానికి వెళ్లి అమ్మవారికి సారె సమర్పించి పూజలు చేశారు. చినతాడినాడలో దుర్గమ్మను శాకంబరిగా అలంకరించి మహిళలు ఆషాఢ సారె సమర్పించారు.

విద్యుత్‌తో జాగ్రత్త : ఏఈ రవికుమార్



ముదినేపల్లి, జూలై 19 : వర్షాకాలంలో ప్రజలు విద్యుత్ పరికరాలతో జాగ్రత్తగా వ్యవహరించాలని ఏపీసీపీడీసీఎల్ ముదినేపల్లి సెక్షన్ ఏఈ పేర్ని రవికుమార్ కోరారు. తడిసిన విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని, విద్యుత్ లైన్లకు తగిలే చెట్లకు దూరంగా ఉండాలని, గృహాల్లో స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోవద్దని, చిన్న పిల్లలను విద్యుత్ సామగ్రికి దూరంగా ఉంచాలని, ఉతికిన బట్టలను ఇనుప తీగలపై ఆరబెట్టరాదని, గాలులకు తెగిన విద్యుత్ వైర్లను తాకరాదని, ఉరుములు, మెరుపులు సంభవించినప్పుడు డిష్ కనెక్షన్ తీసేయాలని, పొలాల్లో ఉన్న కనెక్షన్ స్విచ్‌లను ఆఫ్ చేయాలని, విద్యుత్ లైన్ కింద సెల్‌ఫోన్‌లో మాట్లాడవద్దని, గృహాలకు వచ్చే సర్వీస్ వైర్లు పాడైతే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు గానీ, సిబ్బందికి గానీ తెలియజేయాలని, ప్రతి కరెంట్ వస్తువుకు ఎర్త్ తప్పని సరిగా ఉండాలని ఏఈ తెలిపారు.



గోపాలపురంలో నీటమునిగిన వరి పొలాలను పరిశీలిస్తున్న ఏవో

పొలాల్లో నీరు తొలగించండి

కలిదిండి, జూలై 19 : నీటమునిగిన వెదజల్లిన వరి పొలాల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం గోపాలపురం, సానారుద్రవరం గ్రామాల్లో నీటమునిగిన వెదజల్లిన వరి పొలాలను పరిశీలించారు. పొలాల్లో నీరు తొలగించి ఎకరానికి 20 కిలోల యూరియా, పొటాష్ వేసుకోవాలన్నారు. ప్రస్తుతం నీటమునిగిన పొలాలకు నీరు బయటకు వెళ్లే విధంగా రైతులు చర్యలు తీసుకుంటే వరి పైరుకు ఎటువంటి నష్టం ఉండదన్నారు. మురుగు కాల్వల్లో నీటి పారుదల సక్రమంగా ఉంటే వెదజల్లిన వరి పొలాలు ముంపుకు గురికాకుండా ఉంటాయన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ముసునూరు: వర్షాలతో వరి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.మధుమోహన్ అన్నారు. మండలంలోని గుడిపాడు, చెక్కపల్లి, ముసునూరు, గోపవరం తదితర గ్రామాల్లో జరుగుతున్న వరినాట్లు ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించి, యాజమాన్య పద్ధతులను వివరించారు. నారుమడుల్లో, నాట్లు వేసిన పొలాల్లో వర్షనీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. నీరు నిల్వ ఉంటే నారుమడులు కుళ్ళిపోయే ప్రమాదం ఉందన్నారు. నారుమడుల్లో ఆకుమచ్చలు కనిపిస్తే ట్రైసైక్లోజోల్ లేదా కార్బండిజమ్ ఒక గ్రాము మందు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.

ఇళ్ల వద్ద చేరిన వర్షపునీరు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముసునూరు, జూలై 19: ముంపులో కుమ్మరివారి బజారు.. నీట మునిగిన ఇళ్ళు శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. రమణక్కపేటలోని కుమ్మరివారి బజారులో ముంపునకు గురైన ఇళ్ళను ఎంపీడీవో సీహెచ్.పద్మావతీ దేవి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పరిశీలించారు. ఇంజిన్ ద్వారా నీటిని తొలగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాలు ఆగిన అనంతరం ఆక్రమణలపై పూర్తి సర్వే చేయించి, సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

పేదలకు దుస్తుల వితరణ



కైకలూరు, జూలై 19 : గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని కైకలూరు షిర్డి సాయి ధ్యానమందిరం ఆధ్వర్యంలో పేదలు, యాచకులకు దుస్తులు అందజేశారు. శుక్రవారం ధ్యానమందిరం అధ్యక్షుడు కొణిజేటి శ్రీనివాసరావు, శీతల శోభనబాబు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. 21న గురుపౌర్ణమి సందర్భంగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.



విద్యార్థులకు బస్ పాసులు..

మండవల్లి జూలై 19 : మండవల్లి జడ్పీ హైస్కూలులో 97 మంది విద్యార్థులకు కూటమి నాయకుడు చాపరాల దుర్గాప్రసాద్ చేతుల మీదుగా శుక్రవారం బస్ పాసులను అందజేశారు. లింగాల సర్పంచ్ బోయిడి ధనలక్ష్మి, రాధిక సురేష్‌బాబు ఆర్థిక సహాయంతో విద్యార్థులకు బస్సుపాసులు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, మండవల్లి మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, విద్యాకమిటీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి సత్తిబాబు, గుడివాడ మురళి, గుడివాడ గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు, రేపు అందుబాటులో కామినేని

కైకలూరు జూలై 19: కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఈ నెల 20, 21 తేదీలలో నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. 20వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు తన స్వగ్రామం వరహాపట్నంకు వస్తారు. 3 గంటలకు కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓమోజయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేస్తారు. అనంతరం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 21వ తేదీ ఉదయం 8 గంటలకు లోకుమూడి దత్తాశ్రమంలో, 9 గంటలకు ఆటపాక సాయిబాబా గుడిలో, 9.30కు కైకలూరు సాయిబాబా గుడిలో, 10 గంటలకు సీఎన్నార్ గార్డెన్లో, 11 గంటలకు ముదినేపల్లి మండలం శ్రీహరిపురంలోని సాయిబాబా గుడిలో జరిగే గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి కాకినాడ శ్రీరంగరాయ మెడికల్ కళాశాలలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. 22 నుంచి అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొననున్నట్లు ఆయన కార్యాలయ సిబ్బంది తెలిపారు.

అన్న క్యాంటీన్ భవన పరిశీలన



నూజివీడు, జూలై 19: త్వరలో అన్న క్యాంటీన్‌లను పునః ప్రారంభించ నున్న దృష్ట్యా నూజివీడు ఆర్ఆర్ పేటలోని అన్న క్యాంటీన్ భవనాన్ని నూజివీడు పురపాలక కమిషనర్ రామిరెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన నూజివీడులో అంటువ్యాధులు ప్రబలకుండా తీసు కోవాల్సిన జాగ్రత్తలపై సచివాలయ, పురపాలక ఉద్యోగులకు శుక్రవారం సూచనలిచ్చారు. నివాస గృహాల్లో ఖాళీ ప్రాంతాల్లో, పూల కుండీల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూసుకో వాలన్నారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆయన వెంట ఉన్నారు.



రజక సంఘం నూతన కార్యవర్గం

ముదినేపల్లి, జూలై 19 : ముదినేపల్లి రజక సంఘానికి పూర్తి స్థాయిలో నూతన కార్యవర్గం ఏర్పడింది. సంఘ అధ్యక్షుడు యలకుర్తి నాగరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సంఘ సమావేశంలో ఉపాధ్యక్షులుగా మీసాల సత్యనారాయణ, రాజమండ్రి శ్రీనివాసరావు, కార్యదర్శిగా రావులపాటి వెంకట సుబ్బారావు, సంయుక్త కార్యదర్శులుగా మాడెం శ్రీను, నిడుమోలు హనుమంతరావు, కోశాధికారిగా మల్లంపల్లి కొండలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గ జాబితాను పంచాయతీ అధికారులకు అందజేశారు.

నేటి నుంచి గురు పౌర్ణమి వేడుకలు



ముదినేపల్లి, జూలై 19 : మండలంలోని శ్రీహరిపురంలో ఉన్న షిరిడి సాయి మందిరంలో శనివారం నుంచి గురు పౌర్ణమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. 20వ తేదీ సాయంత్రం అఖండ దీపారాధన, 21న ఉదయం బాబా హారతుల అనంతరం అభిషేకాలు నిర్వహిస్తారు. గురు పౌర్ణమిని పురస్కరించుకుని పెనుమల్లికి చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం బొర్రా శాయరాజు దంపతులకు సత్కారం అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామని మందిర ఛైర్మన్ పరసా ఏడుకొండలు, వైస్ ఛైర్మన్ నీలం నరసింహారావు తెలిపారు. కాగా బాబా మందిరాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇంకా పలు గ్రామాల్లోని బాబా మందిరాలు గురు పౌర్ణమి వేడుకలకు సిద్ధం చేస్తున్నారు.

మహిళా సంక్షేమంపై అవగాహన

ముదినేపల్లి, జూలై 19 : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ముదినేపల్లి మండలం పెదపాలపర్రు, కోడూరు గ్రామాల్లో శుక్రవారం మిషన్ శక్తి కార్యక్రమం కింద స్త్రీ, శిశు సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సులు జరిగాయి. సూపర్‌వైజర్ ఝాన్సీ ఆధ్వర్యంలో మహిళలకు పలు అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు అవగాహన కల్పించారు. ఆరోగ్య పరిరక్షణ, రక్తహీనత నివారణ, పిల్లల్లో పోషకాలు పెంపుతోపాటు బాల్య వివాహాలు అరికట్టడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.



కైకలూరులో రైల్వేగేటు వద్ద ఉన్న గోతుల్లో నిలబడిన వర్షపునీరు



కలిదిండిలో జలమయమైన రాష్ట్ర రహదారి

నీట మునిగిన రహదారులు.. ప్రజల పాట్లు

కైకలూరు జూలై 19 : అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయ్యమయ్యాయి. ఎక్కడ చూసినా రహదారులపై నీరు నిలబడింది. అయితే ఈ వర్షాలతో వరి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై గోతులున్న చోట నీరు నిలబడి వాహనదారులు ఇబ్బం దులకు గురవుతున్నారు. కైకలూరు-కలిదిండి ఆర్అండ్‌బీ రహదారిలో రైల్వేగేటు వద్ద గేటుకు ఇరువైపులా పెద్దపెద్ద గోతులు ఉండడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. గేటు మూసి ఉన్న సమయంలో భారీగా వాహనాలు ఇరువైపులా ఉండడం గేటు తీయడంతో ఎదురెదురుగా తప్పుకునే అవకాశాలు లేక గోతుల్లో పడి ఇక్కట్లకు గురయ్యారు. మరోవైపు గ్రామాల్లో రహదారులన్నీ బురదగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కలిదిండి: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో రహదారులు జలమయమయ్యాయి. కలిదిండి మార్కెట్ యార్డు వద్ద రాష్ట్ర రహదారి జలమయంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ రహదారి పక్కనే పెట్రోల్ బంకు ఉండటంతో ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సానారుద్రవరం నుంచి కోరుకొల్లు వరకు 4 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారి గోతులు పడి అధ్వానంగా ఉంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.